PRGI Reg No -"APTEL/26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 29, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, గురువారం - 19 - మార్చి - 2026 , వెల రూ.5/-

చదవండి..... చదివించండి....
శుభోదయ
ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

# ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి

### రాబోయే మూడు నెలల్లో సుపరిపాలనతో సానుకూల దృక్పథం మరింత పెరగాలి

- తక్కువ ఖర్చుతో పూర్తి చేసే ప్రాజెక్టులకు వెంటనే నిధులు విడుదల చేయాలి
- ఏ ఎమ్మెల్యే ఎన్నిసార్లు పేదల సేవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు? ఎన్ని స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు? ఎన్ని ప్రజాదర్బార్లు పెట్టారు?
- తిరుపతి జిల్లా నేతలకు సీఎం నిర్దేశం
- ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగా ర్యాంకులు



అమరావతి: ఎమ్మెల్యేలు కార్యకర్తలు, ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాబోయే మూడు నెలల్లో సుపరిపాలనతో సానుకూల దృక్పథం మరింత పెరగాలని ఎమ్మెల్యేలకు సూచించారు. తిరుపతి జిల్లా నేతలు, అధికారులతో సీఎం చంద్రబాబు సుమారు 4 గంటలపాటు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. తన దగ్గరున్న వివిధ నివేదికలు, సర్వే రిపోర్టుల ఆధారంగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గాలకు ర్యాంకులను సీల్డ్ కవర్‌లో మిగతా.. 2లో



2లో

## దివ్యాంగుల గౌరవం పెంచేలా ప్రజా ప్రభుత్వం కృషిచేస్తుంది

- ప్రతి ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల
- అమెరికా వెళ్లడం నా జీవితంలో అత్యుత్తమ నిర్ణయం
- అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారు
- దివ్యాంగులతో కలిసి భోజనం చేసిన మంత్రి నారా లోకేశ్

## ఏపీలో దివ్యాంగులకు ఉచిత బస్సు.. ప్రారంభించిన సీఎం చంద్రబాబు



మంగళగిరి: ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. గుంటూరు జిల్లా మంగళగిరి బస్టాండ్‌లో దీన్ని ప్రారంభించిన అనంతరం దివ్యాంగులతో కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులు పల్లె వెలుగు బస్సులో ప్రయాణించారు. డాన్‌బాస్కో స్కూల్ మీదుగా డోలాస్ నగర్, ప్రకాశ్‌నగర్, నులకపేట, ఉండవల్లి సెంటర్ మీదుగా పెనుమాక వెళ్లారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దివ్యాంగులకు అందుతున్న సంక్షేమ పథకాలు, వారి బాగోగుల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. పథకం ప్రారంభం సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు, కూటమి పార్టీల కార్యకర్తలు తరలివచ్చారు.

## ఇరాన్‌పై అమెరికా భారీ దాడులు..

### 'బంకర్ బస్టర్' బాంబులతో విధ్వంసం!

ఢిల్లీ: మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా అలముకున్నాయి. ఇరాన్ లక్ష్యంగా అమెరికా బలగాలు భారీ వైమానిక దాడులకు దిగాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ తీరప్రాంతంలో ఉన్న భూగర్భ క్షిపణి స్థావరాలను ధ్వంసం చేశాయి.



మిగతా.. 2లో

# ఆ ఉత్తర్వులు చూపిస్తే రాజీనామా...

### మహిళలకు ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం ఎగ్గొట్టిందని ధ్వజం

- ఎన్నికల సమయంలో ప్రకటించిన నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదు?
- శాసనసభలో కేటీఆర్ సవాల్
- రూ.57 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చామనడంపై అభ్యంతరం
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 28 నెలలు అవుతున్నా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు
- మహిళలకు ఇచ్చిన హామీలన్నింటినీ ఎగ్గొట్టింది



హైదరాబాద్: రాష్ట్ర మహిళలకు రూ.57 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం చూపిస్తే తాను తక్షణమే పదవికి రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చినట్లు మంత్రి సీతక్క చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 28 నెలలు అవుతున్నా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీలన్నింటినీ ఎగ్గొట్టిందని విమర్శించారు.

కాగితాలపైనే హామీలు

'మహిళలను కోటీశ్వరులను మిగతా.. 2లో



## మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసుపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

- అరెస్టైన వారిలో ఎనిమిది మందికి నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్ వచ్చింది
- ముఖ్యమంత్రిగా తన ప్రమేయం ఏమీ లేదని స్పష్టం
- ఏపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు నిబంధనల మేరకు స్టేషన్ బెయిల్ వచ్చింది



## అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా పార్టీ అధిష్ఠానంతో కీలక సమావేశాలు జరుపుతున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఆయన విడివిడిగా భేటీ అయ్యారు. ఖర్గేతో దాదాపు గంటపాటు జరిగిన సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రతిపక్షాల తీరు వంటి అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వ చీఫ్ విప్ పదవుల నియామకాలపై సీఎం అధిష్ఠానంతో సంప్రదింపులు మిగతా.. 2లో

# పార్టీలకతీతంగా ప్రగతి పరుగులు

- ఆ నాలుగేళ్లు విశాఖకు వైభవం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సహకారంతో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట
- ప్రజల కనీస అవసరాలను తీర్చడంలో జీవీఎంసీ వైఎస్సార్ సీపీ పాలకవర్గం విశేష కృషి



డాబాగార్డెన్స్: విశాఖపట్నం మహా నగర పాలక సంస్థ(జీవీఎంసీ) పాలకవర్గం గడువు ముగియడంతో వైఎస్సార్ సీపీ హయాంలో విశాఖ సాధించిన ప్రగతి మరోసారి తెరపైకి వచ్చింది. 2021 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు మిగతా.. 2లో

## పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరానికి మమతా బెనర్జీ శంఖారావం




ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరానికి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ శంఖారావం పూరించారు. ఈసారి అభ్యర్థుల ఎంపికలో అత్యంత సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారు. పార్టీపై ఉన్న వ్యతిరేకతను అధిగమించే లక్ష్యంతో, ఏకంగా 74 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించి మిగతా.. 2లో


## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో మా ప్రమేయం లేదు

### ప్రియాంకా గాంధీతో సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతలు



ఢిల్లీ: మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. దీనిలో తమ ప్రమేయం ఏమీ లేదని ఆయన చెప్పారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. "మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్ ఇచ్చారు. దీనిలో మా ప్రమేయం ఏమీ లేదు. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్ వేశాం" అని చెప్పారు. 2029లోనే తెలంగాణలో ఎన్నికలు జరుగుతాయని సీఎం అన్నారు. 2028లో ఎన్నికలు రావని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ముందుగా అమల్లోకి వస్తే మంచిదేనని అభిప్రాయపడ్డారు. అంతకుముందు పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలను రేవంత్‌రెడ్డి కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి వెళ్లి వారితో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని రాహుల్, ప్రియాంకలకు రేవంత్ పరిచయం చేశారు.

## క్రమశిక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు



- పార్టీకి నష్టం చేసే వారిని మోయలేం
- పుట్టా మహేశ్ వ్యవహారంపై చంద్రబాబు సీరియస్
- యువతను రాజకీయాల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పుట్టా మహేశ్ కు ఎంపీ టికెట్
- ఆయన ఆ అవకాశాన్ని దుర్వినియోగం చేశారని ఆగ్రహం వ్యక్తం మిగతా.. 2లో

## కిమ్ మార్క్ ప్రజాస్వామ్యం.. నార్త్ కొరియా ఎన్నికల్లో కిమ్ కు 99.93% మంది ఓటేశారట!



2లో

- బ్యాలెట్ పేపర్‌పై కేవలం అధికార పార్టీ అభ్యర్థి పేరు మాత్రమే ఉంటుంది
- ఆ పేరుకు మద్దతుగా ఓటు వేసి తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవడమే

## రష్యా నుంచి చైనాకు చమురు ట్యాంకర్..
# భారత్ దిశగా మళ్లిన అక్వాటైటాన్

ఢిల్లీ: చైనాకు తరలిస్తున్న రష్యా చమురు ట్యాంకర్ అక్వాటైటాన్ భారత్ వైపు మళ్లింది. దక్షిణ చైనా సముద్ర జలాల్లో అది భారత్ దిశ వైపు తిరిగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో, భారత ప్రభుత్వం దేశంలో చమురు సంక్షోభం లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రష్యా నుంచి భారత్ దిగుమతులను పెంచింది. ఈ క్రమంలో అక్వాటైటాన్ ట్యాంకర్ మార్చి 21న కర్ణాటకలోని న్యూమంగళూరుకు చేరుకోనుంది. ఈ ఏడాది జనవరి చివరలో బాల్టిక్ సీ పోర్టులో ఈ ట్యాంకర్‌లోకి చమురు లోడ్ అయింది. ఈ నౌక వాస్తవానికి చైనాలోని రిజావో పోర్టుకు వెళ్లాల్సి ఉంది. యుద్ధం నేపథ్యంలో రష్యా చమురును కొనుగోలు చేయాలని భారత్ నిర్ణయించిన నేపథ్యంలో, ఇప్పుడు దిగుమతులు పెరిగాయి. ఈ నేపథ్యంలో భారత రిఫైనరీలు రష్యా నుంచి 30 మిలియన్ల బ్యారెళ్ల చమురును కొనుగోలు చేశాయి. జపాన్, దక్షిణ కొరియా దేశాలు కూడా రష్యా చమురు దిగుమతులను పెంచడంతో ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి చమురు ట్యాంకర్లు సహా 90 నౌకలు హర్ముజ్ జలసంధిని దాటాయి. ఈ నౌకలన్నీ తమ ట్రాకింగ్ వ్యవస్థలను ఆపేసి, డార్క్ మోడ్‌లో పాశ్చాత్య దేశాల ఆంక్షలను దాటుకుని హర్ముజ్ మీదుగా ప్రయాణించాయి.

## 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురుతో
# భారత్ చేరుకున్న 'జగ్ లాడ్కీ'

ఢిల్లీ: భారత జెండా కలిగిన 'జగ్ లాడ్కీ' అనే ముడి చమురు నౌక గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి వచ్చిన ఈ నౌకలో 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఈ నౌకను ఫుజైరా పోర్టులో లోడ్ చేశారు. 'జగ్ లాడ్కీ' మొత్తం పొడవు 274.19 మీటర్లు, వెడల్పు 50.04 మీటర్లుగా ఉంది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయితే మనవద్ద ఇంధన నిల్వలు ఉన్నాయని, ఆందోళన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. మార్చి 14న ఫుజైరాలోని ఆయిల్ టెర్మినల్‌పై ఇరాన్ దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. 'జగ్ లాడ్కీ' అదే సమయంలో అక్కడ ఇంధనం నింపుకుంటోంది. ఇంధనం నింపుకున్న అనంతరం ఈ నౌక అక్కడి నుంచి బయలుదేరి సురక్షితంగా భారత్ చేరుకుంది. ముర్బన్ క్రూడ్‌తో నిండిన ఈ నౌక మూడు రోజుల ప్రయాణం అనంతరం గుజరాత్ తీరానికి చేరుకుంది. ఇప్పటికే శివాలిక్, నందాదేవి నౌకలు హర్మూజ్ జలసంధిని గుండా ప్రయాణించి సురక్షితంగా భారత్ చేరుకున్నాయి. ఈ నౌకలు ఎల్పీజీ గ్యాస్‌ను తీసుకువచ్చాయి. సముద్రమార్గంలో జరిగే చమురు రవాణాలో ఐదవ వంతు హర్మూజ్ జలసంధి ద్వారా ఉంటుంది.

## కిమ్ మార్క్ ప్రజాస్వామ్యం.. నార్త్ కొరియా ఎన్నికల్లో
# కిమ్ కు 99.93% మంది ఓటేశారట!

ఢిల్లీ: ఉత్తర కొరియాలో ఇటీవల జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు ఒక చరిత్రాత్మక ఘట్టంగా నిలిచాయి. దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ నేతృత్వంలోని 'వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా' ఏకంగా 99.93% ఓట్లతో భూనభోంతరాలన్నీ దద్దరిల్లేలా 'మహా విజయాన్ని' నమోదు చేసింది. ఈ అపురూపమైన విజయంతో కిమ్ వరుసగా మూడోసారి అధికార పగ్గాలు చేపట్టారు. ఉత్తర కొరియాలో ఎన్నికల ప్రక్రియ ఎంత సులువో, ఎంత పారదర్శకమో ఈ ఫలితాలే చెబుతున్నాయి. బ్యాలెట్ పేపర్‌పై కేవలం అధికార పార్టీ అభ్యర్థి పేరు మాత్రమే ఉంటుంది. ఓటర్లు వచ్చి, ఆ పేరుకు మద్దతుగా ఓటు వేసి తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవడమే. ఒకవేళ ఎవరికైనా అభ్యర్థి నచ్చకపోతే, పేరును కొట్టివేసే 'విశాల హృదయం' కూడా ఎన్నికల సంఘం కల్పించింది. అయితే, అలా చేసిన వారిని దేశద్రోహులుగా పరిగణిస్తారు. వారి భవిష్యత్తు ఏమవుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ నేపథ్యంలో, దేశ ప్రజలంతా తమ నాయకుడిపై ఉన్న అచంచలమైన విశ్వాసంతో దాదాపు 100% పోలింగ్‌లో పాల్గొన్నారు. అయితే, ఈ ఎన్నికల్లో అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం 0.07% వ్యతిరేక ఓట్లు. నియంత పాలనలో, ప్రాణాలకు తెగించి కిమ్‌ను వ్యతిరేకించిన ఆ ధైర్యశాలులు ఎవరనే దానిపై ఇప్పుడు అంతర్జాతీయంగా ఆసక్తికర చర్చ నడుస్తోంది. వారి క్షేమ సమాచారాలపై మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఈ ఎన్నికలు కేవలం ఓ బూటకమని, ప్రజలను భయపెట్టి ఓట్లు వేయించుకున్నారని ప్రపంచ దేశాలు విమర్శిస్తున్నా.. తనకు ప్రజల నుంచి తిరుగులేని మద్దతు లభించిందని కిమ్ ఠీవిగా ప్రకటించుకున్నారు. ఈ చారిత్రాత్మక విజయంతో తన దేశంలోని 'ప్రత్యేకమైన ప్రజాస్వామ్యానికి' ఉన్న బలాన్ని ఆయన మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారు.

# క్రమశిక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు

అమరావతి: మొయినాబాద్ డ్రగ్స్ కేసు వ్యవహారం తెలుగుదేశం పార్టీలో పెను తుపాను సృష్టిస్తోంది. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ పేరు ఈ కేసులో ప్రముఖంగా వినిపించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. క్రమశిక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో చంద్రబాబు ఈ అంశంపై స్పందిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యువతను రాజకీయాల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పుట్టా మహేశ్ కు ఎంపీ టికెట్ ఇస్తే, ఆయన ఆ అవకాశాన్ని దుర్వినియోగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి డ్రగ్స్ పార్టీలకు వెళ్లడం క్షమించరాని తప్పని, ఇలాంటి వారి ప్రవర్తన వల్ల పార్టీ సమాధానం చెప్పుకోవాల్సి రావడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దురలవాట్లతో పార్టీ పరువు తీసే వారిని మోయాల్సిన అవసరం తెలుగుదేశం పార్టీకి లేదని చంద్రబాబు కుండబద్దలు కొట్టారు. టీటీడీ మాజీ చైర్మన్, ప్రస్తుత మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడైన మహేశ్... మంచి రాజకీయ నేపథ్యం ఉండి కూడా ఇలా ప్రవర్తించడం సరికాదని చంద్రబాబు హితవు పలికారు. ఇప్పటికే పార్టీ నుండి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని, ఐదు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించామని గుర్తు చేశారు. వివరణ సంతృప్తికరంగా లేకపోతే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. నాయకులంతా ప్రజల్లో విశ్వసనీయతను కాపాడుకోవాలని, వ్యక్తిగత ప్రవర్తన విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని పార్టీ నేతలకు సూచించారు.

## మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్
# కేసుపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. ఈ కేసులో అరెస్టైన వారిలో ఎనిమిది మందికి నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు. ఇందులో ముఖ్యమంత్రిగా తన ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఈ కేసును దర్యాప్తు చేయడానికి ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశామని అన్నారు. ఏపీ ఎంపీ పుట్టా మహేశ్‌కు నిబంధనల మేరకు స్టేషన్ బెయిల్ వచ్చిందని తెలిపారు. 2028లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు రాబోవని జోస్యం చెప్పారు. 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని అన్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు ముందుగానే వస్తే సంతోషిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతకుముందు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఇతర నాయకులతో కలిసి ఆయన అధిష్ఠానం పెద్దలతో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు పరిచయం చేశారు.

# ఇరాన్‌పై అమెరికా భారీ దాడులు..

మొదటి పేజి తరువాయి

ఈ దాడుల్లో సుమారు 2,268 కిలోల బరువుండే అత్యంత శక్తిమంతమైన 'బంకర్ బస్టర్' బాంబులను ఉపయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారికంగా ధ్రువీకరించింది. ఈ బాంబులు భూగర్భంలోని కాంక్రీట్ కట్టడాలను ఛేదించుకుని వెళ్లి, అక్కడ దాచి ఉంచిన నౌకా విధ్వంసక క్షిపణులను పూర్తిగా నాశనం చేశాయని తెలిపింది. అంతర్జాతీయ నౌకాయానానికి ఈ క్షిపణుల నుంచి ముప్పు పొంచి ఉందన్న కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. అయితే, ఈ విషయంలో మిత్రదేశాల నుంచి ఆశించిన మద్దతు లభించకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. "మాకు ఎవరి సహాయం అవసరం లేదు, ఒంటరిగానే ఇరాన్‌ను ఎదుర్కోగలం" అని ఆయన స్పష్టం చేశారు. ఫ్రాన్స్ వంటి దేశాలు ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనడానికి నిరాకరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ దాడుల నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాలో 20 శాతం వాటా ఉన్న జలసంధి మార్చి మొదటి వారం నుంచే దాదాపు మూతపడింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు భగ్గుమన్నాయి. అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌లోని రామత్ గన్ నగరంపై క్షిపణి దాడులు చేయగా, ఇద్దరు పౌరులు మరణించారు. మరోవైపు, ఇరాన్ నుంచి వస్తున్న డ్రోన్లు, క్షిపణులను యూఏఈ, కువైట్, బహ్రెయిన్ తమ రక్షణ వ్యవస్థలతో సమర్థవంతంగా కూల్చివేస్తున్నాయి. ఇరాన్ అణు కార్యకలాపాలను వేగవంతం చేయవచ్చన్న ఆందోళనల నడుమ అమెరికా తన దాడులను అణు ప్లాంట్ల సమీపంలోని క్షిపణి కేంద్రాలపైకి మళ్లించడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది.

## అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు,
# ఎమ్మెల్సీలు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి

మొదటి పేజి తరువాయి

సీఎం అధిష్ఠానంతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. పార్టీ అభ్యర్థులుగా బరిలోకి దిగిన వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. ఎలాంటి విమర్శలకు తావివ్వకుండా రెండు స్థానాలను గెలుచుకోవడం పట్ల ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లను వారు అభినందించారు. అనంతరం నూతన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని వెంటబెట్టుకుని రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్.. ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని గతంలో జరిగిన సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్.. కేంద్ర మంత్రులతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో కూడా సమావేశమయ్యే అవకాశం ఉంది. మరోవైపు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సైతం ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. రాహుల్ గాంధీ అధ్యక్షతన జరగనున్న ఆదివాసీ కాంగ్రెస్ కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొననున్నారు. తన పర్యటన ముగించుకుని సీఎం రేవంత్ రెడ్డి నేరుగా హైదరాబాద్ చేరుకుని అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## దివ్యాంగుల గౌరవం పెంచేలా
# ప్రజా ప్రభుత్వం కృషిచేస్తుంది

అమరావతి: దివ్యాంగుల గౌరవం పెంచేలా ప్రజా ప్రభుత్వం కృషిచేస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించారు. మంగళగిరి బస్ స్టేషన్ నుంచి పెనుమాక వరకు దివ్యాంగులతో కలిసి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్ ప్రయాణించారు. అనంతరం ఉండవల్లి నివాసంలో 'దివ్యాంగ శక్తి పథకం' లబ్ధిదారులతో జరిగిన ఆత్మీయ విందు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులను ఆత్మీయంగా పలకరించిన మంత్రి లోకేశ్, తన పక్కన కూర్చొన్న శివనాగరాజు, సౌభాగ్య, ఖాశీంబి, అన్నపూర్ణమ్మలతో మమేకమై మాటామంతీ కలిపారు. వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దివ్యాంగుల గౌరవం పెంచాలని, వారిలో పట్టుదల ఎక్కువ అని అన్నారు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని తెలిపారు. వారి నుంచి ఎంతో నేర్చుకోవచ్చని అన్నారు. వికలాంగుల ఆత్మగౌరవం ముఖ్యమని లోకేశ్ పేర్కొన్నారు. సమాజంలో కూడా మహిళలను కించపరిచే పదాలను అందరూ విడనాడాలని, ఇందుకోసం తాను పోరాడుతున్నానని అన్నారు.

ప్రతి ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల

"కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే డీఎస్సీ ద్వారా 16వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేశాం. ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల చేస్తున్నాం. ఇకపై ప్రతి ఉగాదికి జాబ్ కేలండర్ విడుదల చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు రావడం ద్వారా ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి కల్పన జరుగుతుంది. అందుకే అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నాం. మంగళగిరిలో ప్రభుత్వ భూమి లభ్యత చాలా తక్కువగా ఉంది. అందుకే కాజా వద్ద 75 ఎకరాల భూమి కొనుగోలు చేస్తున్నాం. మంగళగిరికి 4,5 ఐటీ కంపెనీలను తీసుకువస్తాం. సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తుంది" అని లోకేశ్ తెలిపారు.

అమెరికా వెళ్లడం నా జీవితంలో అత్యుత్తమ నిర్ణయం

స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఎంతో లబ్ధి చేకూరుతోందని లోకేశ్ అన్నారు. స్త్రీలు ఎవరిపై ఆధారపడకూడదని అభిప్రాయపడ్డారు. ఇంటర్ తర్వాత అమెరికా వెళ్లడం తన జీవితంలో అత్యుత్తమ నిర్ణయమని తెలిపారు. అందుకే నా సొంత కాళ్లపై నిలబడగలిగానని, దాదాపు 8 ఏళ్లు నేను అమెరికాలో ఉన్నానని వెల్లడించారు. చదువుతో పాటు ఉద్యోగం చేశానని, దీంతో తనకు ఎంతో అవగాహన వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల యోగక్షేమాలను, ప్రభుత్వం నుంచి అందుతున్న లబ్ధిని ఈ సందర్భంగా మంత్రి అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ అందుకున్న తర్వాత ఐవీఆర్ఎస్ కాల్స్, సీఎం సందేశం వస్తున్నాయా అని వాకబు చేశారు. తమ పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రిని విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వంలో అన్నివిధాల అండగా ఉంటామని మంత్రి లోకేష్ వారికి హామీ ఇచ్చారు. వారితో కలిసి ఫోటోలు దిగారు.

# మూసీ ప్రాజెక్టు
# రూ.1.5 లక్షల కోట్ల స్కామ్

ఢిల్లీ: మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పేరుతో తెలంగాణ ప్రభుత్వం ఏకంగా రూ.1.5 లక్షల కోట్ల భారీ ఆర్థిక కుంభకోణానికి తెరలేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై శాసనసభలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రభుత్వ వైఖరిలో పారదర్శకత లేదని నిరసిస్తూ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో కేటీఆర్ మాట్లాడుతూ.. మూసీ నది పునరుజ్జీవనానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని, కానీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భారీ దోపిడీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధమైతే, దానిని ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. డీపీఆర్ లేకుండానే వేల ఇళ్ల కూల్చివేతకు, భూసేకరణకు ఎలా సిద్ధమవుతారని ప్రభుత్వాన్ని నిలదీశారు. కేటీఆర్ ఆరోపణలను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు. ప్రాజెక్టుపై ఎలాంటి దాపరికం లేదని, కేటీఆర్ ఆరోపణలు నిరాధారమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించిన డీపీఆర్ పూర్తయిందని, దాని అంచనా వ్యయం రూ.6,500 కోట్ల నుంచి రూ.7,000 కోట్ల వరకు ఉంటుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు వల్ల 1,435 నిర్మాణాలు ప్రభావితం అవుతాయని, తుది గణన జరుగుతోందని తెలిపారు. బఫర్ జోన్‌లో ఉన్న వారికి బదిలీ చేయగల అభివృద్ధి హక్కులు (టీడీఆర్) ఇస్తామని, భూసేకరణ, పునరావాసం 2013 చట్టం ప్రకారమే జరుగుతుందని హామీ ఇచ్చారు. అయితే, ప్రభుత్వ వాదనను కేటీఆర్ తోసిపుచ్చారు. ముఖ్యమంత్రి బహిరంగ సభల్లో రూ.1.5 లక్షల కోట్ల ప్రాజెక్టు అంటుంటే, సభలో మంత్రులు కేవలం రూ.7,000 కోట్లు అని చెప్పడంలోనే వైరుధ్యం కనిపిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ గెజిట్ ప్రకారం 10,000 ఇళ్లు కూల్చివేస్తారని, 3,260 ఎకరాల భూమిని సేకరించనున్నారని పేర్కొన్నారు. సింగపూర్, పాకిస్థాన్ వంటి దేశాల్లో నిషేధానికి గురైన 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి డీపీఆర్ బాధ్యతలు ఎలా అప్పగించారని ఆయన ప్రశ్నించారు. 18 నెలలు పట్టే డీపీఆర్‌ను రెండు నెలల్లోనే ఎలా పూర్తి చేశారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, స్పష్టమైన ప్రణాళిక కూడా లేదని, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి ఎలాంటి రుణం మంజూరు కాలేదని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ సమాధానంతో సంతృప్తి చెందని ఆయన, పారదర్శకత పాటించడం లేదని ఆరోపిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.

## పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరానికి
# మమతా బెనర్జీ శంఖారావం

మొదటి పేజి తరువాయి

అందరినీ ఆశ్చర్యపరిచారు. అవినీతి ఆరోపణలు, పనితీరు సరిగా లేని వారిని పక్కనపెట్టి, 'క్లీన్ ఇమేజ్' ఉన్న కొత్త ముఖాలకు ప్రాధాన్యమిచ్చారు. మొత్తం 291 మంది అభ్యర్థులతో టీఎంసీ తొలి జాబితాను విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం మమతా బెనర్జీ నియోజకవర్గం. ఆమె తన కంచుకోట అయిన భవానీపూర్ నుంచే బరిలోకి దిగుతున్నారు. అయితే, బీజేపీ కూడా దీదీని ఆమె సొంత నియోజకవర్గంలోనే కట్టడి చేయాలనే వ్యూహంతో, అక్కడ సువేందు అధికారిని రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. అలాగే ఆయన నందిగ్రామ్ నుంచి కూడా పోటీ పడుతున్నట్టు తెలుస్తోంది. దీంతో బెంగాల్ రాజకీయాల్లో భవానీపూర్ ఇప్పుడు కేంద్ర బిందువుగా మారింది. ఇక, టీఎంసీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేశారు. ఇందులో 50 మంది మహిళలు, 79 మంది షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ), 17 మంది షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ), 42 మంది ముస్లిం అభ్యర్థులకు చోటు కల్పించారు. మరోవైపు, టికెట్లు దక్కని పలువురు నేతలు బహిరంగంగానే అసమ్మతి వ్యక్తం చేస్తున్నారు. వీరిలో కొందరు బీజేపీలో చేరే అవకాశాలు కనిపిస్తుండటంతో బెంగాల్ రాజకీయాలు మరింత వేడెక్కాయి.

## 500 కోట్ల భోజనాలు: అక్షయపాత్రకు
# సీఎం చంద్రబాబు ప్రశంసలు

అమరావతి: అక్షయపాత్ర ఫౌండేషన్ సేవలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మనస్ఫూర్తిగా అభినందించారు. సంస్థ 25 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో పాటు, 500 కోట్ల భోజనాలు అందించిన అద్భుతమైన మైలురాయిని చేరుకోవడంపై ఆయన ప్రశంసలు కురిపించారు. మానవసేవ ద్వారా, ముఖ్యంగా నిరుపేదలకు అండగా నిలవడం ద్వారా ఉత్తమ ప్రపంచాన్ని నిర్మించగలమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారి సమక్షంలో రాష్ట్రపతి భవన్‌లో ఈ మైలురాయిని చేరుకోవడం అభినందనీయం. అక్షయపాత్ర సమాజానికి, ముఖ్యంగా పిల్లలకు అందిస్తున్న సేవలు ఎనలేనివి" అని పేర్కొన్నారు. పీఎం పోషణ్ వంటి కార్యక్రమాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో అన్నా క్యాంటీన్ల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు భోజనం అందించడంలో అక్షయపాత్ర కీలక భాగస్వామిగా ఉందని ఆయన గుర్తుచేశారు. దేశ భవిష్యత్తుకు పోషణ అందిస్తున్న ఈ సంస్థ సేవలు "సుపోషిత్, సుశిక్షిత్, వికసిత్ భారత్" నిర్మాణానికి దోహదపడుతున్నాయని చంద్రబాబు కొనియాడారు. భవిష్యత్తులోనూ అక్షయపాత్ర మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

# ఆ ఉత్తర్వులు చూపిస్తే రాజీనామా



హైదరాబాద్: రాష్ట్ర మహిళలకు రూ.57 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం చూపిస్తే తాను తక్షణమే పదవికి రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చినట్లు మంత్రి సీతక్క చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 28 నెలలు అవుతున్నా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీలన్నింటినీ ఎగ్గొట్టిందని విమర్శించారు.

కాగితాలపైనే హామీలు

'మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ మభ్యపెడుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదు? కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్ పెంపు, తులం బంగారం వంటి హామీలు అన్నీ కాగితాలపైనే మిగిలిపోయాయి. కేసీఆర్ కిట్ వంటి పథకాలను నిలిపివేయడం వల్ల తల్లీబిడ్డల సంక్షేమం దెబ్బతింటుంది. కేసీఆర్ పేరు ఇష్టం లేకపోతే రాహుల్‌గాంధీ కిట్ అని పేరు పెట్టి అయినా అమలు చేయండి. నిరుద్యోగులకు 60 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు పదే పదే అబద్ధాలు చెపుతున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 11,921 ఉద్యోగాలే ఇచ్చింది. మిగిలినవన్నీ కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లే. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం యువతను మోసం చేస్తోంది. జాబ్ క్యాలెండర్‌లో జాబులు లేవు.. కేవలం తేదీలు మాత్రమే ఉన్నాయి. రైతులకు మూడు సీజన్లలో రైతు భరోసా ఎగ్గొట్టారు. డిసెంబర్‌లో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం పంటలు కోతకు వచ్చే టైంలో కూడా అందలేదు. ఇప్పుడు అసెంబ్లీ ఉందని అప్పుడిస్తాం.. ఇప్పుడిస్తాం అంటూ లీకులిస్తున్నారు. 22 లక్షల మంది కౌలు రైతులకు ఇచ్చిన హామీలను కూడా పూర్తిగా తుంగలో తొక్కారు. ఏ గ్రామంలోనైనా రుణమాఫీ 100 శాతం అమలు జరిగిందని నిరూపిస్తే ఆ ఊరికి వెళ్లి నా రాజీనామా అందజేస్తా..'అని కేటీఆర్ మరో సవాల్ చేశారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం..
# జిల్లాల్లో ఉరుములు, మెరుపుల వాన



హైదరాబాద్: తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక, హైదరాబాద్‌లో మంగళవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. సిటీలోని పలుచోట్ల వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. హైదరాబాద్ నగరంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి 2 గంటల సమయంలో వాన దంచికొట్టింది. నగర వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఉక్కపోత నుంచి ఉపశమనం లభించినట్లు అయింది. ఉరుములు, మెరుపులు మెరిశాయి. చల్లని గాలులు వీచడంతో పూర్తిగా వాతావరణం మారిపోయింది. అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, చింతల్, షాపూర్, జీడిమెట్ల, మహేశ్వరం, షాద్‌నగర్, శంషాబాద్, రాజేంద్రనగర్, బండ్లగూడ జాగీర్, బహదూర్‌పురా, కార్వాన్, కాటేదాన్, బార్కస్, చాంద్రయణగుట్ట, చార్మినార్, ఎల్‌బీ నగర్, సరూర్ నగర్, వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్, సంతోష్‌నగర్, చాదర్‌ఘాట్, కోఠి, నల్లకుంట, రాంనగర్, తార్నాక, హబ్సిగూడ, సికింద్రాబాద్, ఖైరతాబాద్, బేగంపేట్, పంజాగుట్ట, సోమాజిగూడ, మెహిదీపట్నంతో పాటు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనూ వర్షం కురిసింది. అకాల వర్షానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురుగాలుల నేపథ్యంలో మామిడి కాయలు నేలరాలాయి. వరి ధాన్యం కూడా అక్కడక్కడ తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 22వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉంది.

# ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి

అమరావతి: ఎమ్మెల్యేలు కార్యకర్తలు, ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాబోయే మూడు నెలల్లో సుపరిపాలనతో సానుకూల దృక్పథం మరింత పెరగాలని ఎమ్మెల్యేలకు సూచించారు. తిరుపతి జిల్లా నేతలు, అధికారులతో సీఎం చంద్రబాబు సుమారు 4 గంటలపాటు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. తన దగ్గరున్న వివిధ నివేదికలు, సర్వే రిపోర్టుల ఆధారంగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గాలకు ర్యాంకులను సీల్డ్ కవర్‌లో అందించారు. తక్కువ ఖర్చుతో పూర్తి చేసే ప్రాజెక్టులకు వెంటనే నిధులు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సమావేశం చివర్లో ఎమ్మెల్యేలు ప్రస్తావించిన పలు సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేశారు. సమీక్షకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్, ఎస్పీ హాజరయ్యారు.

సీఎం ప్రధానంగా చర్చించిన అంశాలు

మండల స్థాయి సమస్యలు, తాగు, సాగునీటి ప్రాజెక్టులు, పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు, రోడ్లు, మున్సిపాలిటీల్లో ప్రధాన సమస్యలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించే నిర్ణయాలు. ఏ ఎమ్మెల్యే ఎన్నిసార్లు పేదల సేవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు? ఎన్ని స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు? ఎన్ని ప్రజాదర్బార్లు పెట్టారు? ప్రెస్‌మీట్లు, సోషల్ మీడియాలో యాక్టివ్, వైకాపా తప్పుడు ప్రచారాలు తిప్పికొట్టడంలో ఎంత మేర పనిచేస్తున్నారు వంటి అంశాలపై స్పష్టమైన డేటాతో నివేదికలు. ఎమ్మెల్యేలతో పాటు వివిధ విభాగాల్లో జిల్లా అధికారుల పనితీరుపైనా నివేదికలు. ప్రభుత్వ విభాగాల పనితీరు, సిబ్బంది కొరత, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, బస్సు సౌకర్యం, పారిశుద్ధ్యం, శాంతిభద్రతలు, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్‌లో నియోజకవర్గాల పనితీరు.


# ఇరాన్‌కు భారత్ మానవతా సాయం




ఢిల్లీ: అమెరికా-ఇజ్రాయెల్ దాడులతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఇరాన్‌కు భారత్ మానవతా దృక్పథంతో అండగా నిలిచింది. యుద్ధం కారణంగా మందుల కొరతతో అల్లాడుతున్న ఆ దేశానికి అత్యవసర వైద్య సామాగ్రితో కూడిన తొలి విడత సాయాన్ని అందించింది. ఈ సహాయం ఇరాన్‌కు చేరినట్లు ఆ దేశ ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించింది. కష్టకాలంలో ఆదుకున్నందుకు భారత ప్రజలకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసింది. ఫిబ్రవరి 28 నుంచి కొనసాగుతున్న దాడుల వల్ల ఇరాన్‌లో తీవ్రమైన మానవతా సంక్షోభం నెలకొంది. వేలాది మంది పౌరులు గాయపడగా, ఆసుపత్రుల్లో అత్యవసర మందులకు తీవ్ర కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో స్పందించిన భారత్, తొలి విడత వైద్య సామాగ్రిని పంపింది. ఈ సహాయాన్ని అక్కడి 'ఇరానియన్ రెడ్ క్రెసెంట్ సొసైటీ' అందుకుంది. ఈ విషయాన్ని న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం బుధవారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. "భారత ప్రజలు పంపిన తొలి విడత వైద్య సాయం ఇరానియన్ రెడ్ క్రెసెంట్ సొసైటీకి చేరింది. దయార్ద్ర హృదయులైన భారత ప్రజలకు మా హృదయపూర్వక ధన్యవాదాలు" అని పేర్కొంది. ఇరాన్‌లోని పౌరులకు మానవతా సాయం అందించే విషయంపై చర్చలు జరుపుతున్నట్లు భారత విదేశాంగ శాఖ కొద్ది రోజుల క్రితమే ప్రకటించింది. ఆ చర్చలు ఫలించి, ఇప్పుడు సాయం చేరడం గమనార్హం. భారత్‌తో పాటు చైనా, అజర్‌బైజాన్, రష్యా వంటి దేశాలు కూడా ఇరాన్‌కు సహాయాన్ని అందిస్తున్నాయి. యుద్ధం కారణంగా చిక్కుకుపోయిన భారతీయులను సురక్షితంగా తరలించేందుకు కూడా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# పార్టీలకతీతంగా ప్రగతి పరుగులు

అమరావతి: విశాఖపట్నం మహా నగర పాలక సంస్థ(జీవీఎంసీ) పాలకవర్గం గడువు ముగియడంతో వైఎస్సార్ సీపీ హయాంలో విశాఖ సాధించిన ప్రగతి మరోసారి తెరపైకి వచ్చింది. 2021 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు నాలుగేళ్ల పాటు మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన గొలగాని హరి వెంకటకుమారి హయాంలో నగరం అనేక రంగాల్లో అభివృద్ధిని సాధించింది. ఎలాంటి రాజకీయ పరిజ్ఞానం లేని విద్యావేత్త అయిన బీసీ సామాజికవర్గానికి చెందిన మహిళను, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నగర ప్రథమ పౌరురాలిగా ఎంపిక చేయడం విశాఖ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయానికి నాంది పలికింది. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో బాధ్యతలు చేపట్టిన పాలకవర్గం, ప్రజలకు అండగా నిలుస్తూనే నగరాన్ని ప్రగతి పథంలో నడిపించింది. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సహకారంతో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశారు. దశాబ్దాలుగా పాతనగరం వాసులను వేధిస్తున్న ఇరుకు రోడ్ల కష్టాలకు చెక్ పెడుతూ, జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీసు వరకు రోడ్డు విస్తరణ పనులను విజయవంతంగా పూర్తి చేసి వారి చిరకాల స్వప్నాన్ని నెరవేర్చారు. అంతర్జాతీయ సదస్సులకు వేదికైన విశాఖను సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రధాన కూడళ్లను విద్యుత్ దీపాలు, వాటర్ ఫౌంటైన్లతో ఆకర్షణీయంగా మార్చారు. బీచ్‌లను సుందరంగా మార్చారు. రూ.2.3 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో జగదాంబ జంక్షన్‌లో 20 మీటర్ల క్లాక్ టవర్‌ను నిర్మించారు. పచ్చదనంతో నగరానికి కొత్త అందాలు అద్దారు. మూలకు చేరిన శివాజీ పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడం, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియానికి రూ.16.90కోట్లతో నూతన హంగులు తీసుకురావడం పాలకవర్గ పనితీరుకు నిదర్శనంగా నిలిచాయి.



సమగ్రాభివృద్ధే లక్ష్యంగా.. : కేవలం సుందరీకరణకే పరిమితం కాకుండా, ప్రజల కనీస అవసరాలను తీర్చడంలో జీవీఎంసీ వైఎస్సార్ సీపీ పాలకవర్గం విశేష కృషి చేసింది. మధురవాడ జోన్2 భూగర్భ మురుగునీటి వ్యవస్థకు ఏకంగా రూ.553 కోట్లు, రోడ్ల నిర్వహణ, గుంతల పూడ్చివేతకు రూ.770 కోట్లు, సామాజిక భవనాల నిర్మాణం, నిర్వహణకు రూ.700 కోట్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి రూ.159 కోట్లు, 24 గంటల మంచినీటి పథకానికి రూ.140 కోట్లు కేటాయించి నగర మౌలిక రూపురేఖలను మార్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం నాడునేడు ద్వారా నగరంలోని ప్రభుత్వ పాఠశాలలు, పబ్లిక్ హెల్త్ సెంటర్లను కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించి పేదలకు మెరుగైన విద్య, వైద్యాన్ని చేరువ చేశారు. సింహాచలం వచ్చే భక్తుల కోసం మౌలిక వసతుల కల్పనతో పాటు అడవివరం రోడ్డును విస్తరించారు. ఈ మేరకు భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు అందజేసి ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకున్నారు.

పార్టీలకతీతంగా ప్రగతి పరుగులు

కుల, మత, పార్టీలకతీతంగా అందరినీ కలుపుకుపోతూ.. పారిశుధ్య నిర్వహణలో ఎక్కడా రాజీ పడకుండా పగలు, రాత్రి అనే తేడా లేకుండా మేయర్ స్వయంగా పర్యవేక్షించడం నగర స్వచ్ఛతకు ఎంతో దోహదపడింది. నగర ప్రథమ పౌరురాలిగా ఇద్దరు రాష్ట్రపతులు, ఉపరాష్ట్రపతులకు, ముఖ్యమంత్రికి ఆతిథ్యం ఇవ్వడంతో పాటు ఐదుగురు కమిషనర్లు, ఒక స్పెషలాఫీసర్‌తో సమన్వయం చేసుకుంటూ హుందాగా పరిపాలన సాగించారు. మొత్తంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గనిర్దేశంలో, మేయర్ హరి వెంకటకుమారి నేతృత్వంలో నగరం ఆ నాలుగేళ్లలో ప్రశాంతంగా.. అభివృద్ధిలో దూసుకుపోయిందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సాయం



గుడివాడ, మార్చి 18 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ) గుడివాడ మండలం బిళ్ళపాడు గ్రామం రిక్షా కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన గృహ దహనమై సర్వం కోల్పోయిన బాధితురాలు ఆది మేరీ కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో సహకారం అందించారు. రెడ్ క్రాస్ జిల్లా సెక్రటరీ భవిరి శంకర్ నాథ్, రెడ్ క్రాస్ పాటర్న్ సభ్యులు ఉపద్రష్ట రాంబాబు బాధితులకు వంట పాత్రలు, తాత్కాలిక నివాసం కొరకు టార్పాలిన్ మరియు దుప్పట్లు అందజేశారు. సహాయ కార్యక్రమంలో స్థానిక వీఆర్వో సుధారాణి రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ హరికృష్ణ విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు జానీ తదితరులు పాల్గొన్నారు

# ‘దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యశీ ద్వారా 12.76 లక్షల మందికి లబ్ధి..‘

– దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం ఉగాది కానుక..!

**– దివ్యాంగులతో స్వయంగా బస్సులో ప్రయాణించి, తన స్వగ్రామానికి తీసుకువెళ్లి భోజనాలు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే..!**

**– దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కోరుకొండలో ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి ( ఏ.కె.); ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. బుధవారం కోరుకొండ బస్టాండ్ వద్ద దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని ఆయన ప్రారంభించారు. వీరితో పాటు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో–ఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో దివ్యాంగులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించి, వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు ప్రభుత్వం పెన్షన్‌ను 6000 రూపాయలకు పెంచడంతో పాటు ఇప్పుడు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. దివ్యాంగులతో పాటు ప్రయాణించే సహాయకులకు టికెట్ ధరలో 50% సబ్సిడీ ఇస్తూ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి, వారు పనుల నిమిత్తం లేదా ఆసుపత్రులకు వెళ్లేందుకు రవాణా భారం కాకూడదనే ఉద్దేశంతో మహిళలకు కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు.



ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, దివ్యాంగుల మరియు బలహీన వర్గాల బాధ్యతను భుజానికెత్తుకుని ఈ పథకాలను అమలు చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. దివ్యాంగులు మరియు యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఎం.ఎస్.ఎం.ఈ. పార్కుల ద్వారా సబ్సిడీలు మరియు లోన్లు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్వయంగా దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి, వారిని గాదరాడలోని తన నివాసానికి తీసుకెళ్లి విందు ఏర్పాటు చేసి వారితో పాటు కలిసి సహపంక్తి భోజనం చేస్తూ... వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భోజనాలు అనంతరం వారిని దగ్గరుండి బస్సు ఎక్కించి వారి గ్రామాలకు పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఆర్డీఓ, ఎంఆర్ఓ, ఎంపీడీఓ, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం రైతుల పక్షం, రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుంది

–పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్




పెనమలూరు, మార్చి 18 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ ) కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని, రాష్ట్రంలోని ప్రతి రైతుకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. పెనమలూరు నియోజకవర్గం తాడిగడపలో అన్నదాత సుఖీభవ పి. ఎం. కిసాన్ యోజన కింద రైతులకు మూడో విడతగా 4 కోట్ల 29లక్షలరూపాయలు నిధులు నేరుగా జమ చేయడం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు ఆనందంగా ఉండే విధంగా చర్యలు చేపట్టడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. అన్నం పెట్టే రైతు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నమ్మే నాయకుల్లో ముఖ్యుడు నారా చంద్రబాబు నాయుడు అని, అటువంటి నాయకత్వంలో మేము పనిచేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ ఉయ్యూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ కొండ ప్రవీణ్, కంకిపాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ ధనరామ కోటేశ్వరరావు, రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంటి శివరామ ప్రసాద్ గౌడ్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోపీచంద్, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ పాతపూడి గణేష్,రజక కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరాస్వామి, శ్రీ దుర్గా మల్లేశ్వర దేవస్థానం డైరెక్టర్ వెలగపూడి శంకర్ బాబు,పెనమలూరు మండల పార్టీ అధ్యక్షులు కోయా ఆనంద్, పెనమలూరు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు సంగేపు రంగారావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మారుపూడి ధన కోటేశ్వరరావు, ఏ కుల విజయేంద్ర క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల రామ్ కుమార్ మహిళా నాయకులు యార్లగడ్డ సుచిత్ర పండుల రజిని మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పి4 పథకంలో భాగంగా ఆర్వో ప్లాంట్, వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ




హనుమాన్ జంక్షన్, మార్చి 18 ( అజయ్ నారగాని – నేటి శుభోదయ ) పి 4 పథకంలో భాగంగా హనుమాన్ జంక్షన్ బస్ స్టాండ్‌లో స్రవంతి చారిటబుల్ ట్రస్ట్, అన్వి సూపర్ స్పెషాలిటీ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. అనంతరం బాపులపాడు గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షులు అట్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్‌ను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావ్ మాట్లాడుతూ, హనుమాన్ జంక్షన్ వంటి రద్దీగా ఉండే బస్ స్టేషన్‌లో ప్రయాణికుల కోసం శుభ్రమైన తాగునీరు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ఆర్వో ప్లాంట్ ద్వారా రోజూ బస్సు ప్రయాణికులు, స్థానిక ప్రజలు సురక్షితమైన తాగునీటిని సులభంగా పొందగలరని తెలిపారు. సేవా భావంతో ప్రజల కోసం ఇలాంటి సదుపాయాలు ఏర్పాటు చేయడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ప్రజలకు అవసరమైన ప్రాథమిక వసతులు అందించడంలో ప్రభుత్వం, సేవా సంస్థలు కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆకాంక్షించారు.

# యువత భవిష్యత్ పై వైసీపీ దాడి. ప్రపంచ టెక్ దిగ్గజం

**టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్**



అమరావతి మార్చి 18. ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ విశాఖలో రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ఏఐ సిటీ నిర్మించేందుకు ముందుకు రావడం ఆంధ్రప్రదేశ్ కు చారిత్రాత్మక అవకాశమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు అమరావతిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇది దేశంలోనే అతి పెద్ద ఎఫ్ఎఐల్లో ఒకటి మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్తును మలిచే గేమ్ చేంజర్ ప్రాజెక్ట్ అని ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 1.80 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించే పరిస్థితి ఉందని ఆయన తెలిపారు గూగుల్ రాకతో విశాఖ కేవలం ఒక నగరంగా కాదు, ప్రపంచ స్థాయి టెక్నాలజీ హబ్ ఎదిగే అవకాశం ఉందని. ఈ ప్రాజెక్ట్ వలన ప్రపంచ కేబుల్ నెట్ వర్క్ కు విశాఖ కీలక కేంద్రంగా మారబోతోందని. దేశానికి ఏఐ క్యాపిటల్ గా విశాఖ నిలిచే స్థాయికి ఈ పెట్టుబడి దోహదపడుతుందని ఆయన తెలిపారు. దీని ప్రభావం కేవలం విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతానికే పరిమితం కాదని .యావత్ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని. ఇలాంటి ప్రాజెక్టులు వస్తే ఐటీ, మౌలిక సదుపాయాలు, సేవారంగం, రియల్ ఎస్టేట్, చిన్న వ్యాపారాలు అన్నీ కలిసి విస్తృతంగా లాభపడతాయని ఆయన తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద పెట్టుబడిని ఆకర్షించడానికి, భూమి కేటాయించడానికి ముందుకొస్తే దానిని స్వాగతించాల్సింది పోయి వైసీపీ అడ్డుకునే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు విశాఖ భవిష్యత్తుకు బలం చేకూర్చే గూగుల్ ప్రాజెక్టును అడ్డుకునేందుకు వైసీపీ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కోర్టులో పిల్ వేయడం పూర్తిగా అభివృద్ధి వ్యతిరేక వైఖరిని ఆయన విమర్శించారు. ప్రజలకు ఉద్యోగాలు రావాలి, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలి, విశాఖ గ్లోబల్ స్థాయిలో ఎదగాలి అనే ఆలోచన ఉంటే ఇలాంటి ప్రాజెక్టులను మద్దతు ఇవ్వాలి. కానీ వైసీపీ మాత్రం మరోసారి కోర్టు కేసులతో, పిటిషన్లతో అభివృద్ధిని నిలిపివేయాలనే వ్యతిరేక స్వభావాన్ని బయటపెట్టుకుందని ఆయన విమర్శించారు. కోర్టులో పిల్ వేసి చివాట్లు తినడం ఒక్కసారే కాదని గతంలో కూడా టి సి ఎస్ కాగ్నిజెంట్ వంటి సంస్థల భూముల కేటాయింపుల విషయంలో వైసీపీ నేతలు ఇదేవిధంగా పిటిషన్లు వేసి కోర్టు చేత మొట్టికాయలు వేయించుకున్నారని ఆయన విమర్శించారు రాష్ట్రంలో పరిశ్రమలను ఆకర్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం రైతులు ప్రోత్సహకాలు ఇస్తే తప్పు ఏంటి? అని ఆయన ప్రశ్నించారు రాయితీలు ప్రోత్సాహకాలు ఇవ్వకుంటే ఏ కంపెనీ అయినా పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తాయా ? అని ఆయన ప్రశ్నించారు ఇది యువత భవిష్యత్తుకు మేలు కలిగే ప్రాజెక్టులుగా పరిగణించాలని వైసీపీ నేతలకు మితి బోధించిందిన్నారు పరిశ్రమలు వస్తే అడ్డుకోవడం పెట్టుబడులు వస్తే అనుమానాలు రేపడం ఉద్యోగాలు రాబోతంటే కోర్టులో కేసులు వేయడం వైసిపి నేతలకే చెల్లిందన్నారు రాష్ట్ర ప్రజల కంటే రాజకీయ కుతంత్రం గూండాయిజానికి వైసీపీ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన విమర్శించారు కూటమి ప్రభుత్వం విశాఖను ఏఐ క్యాపిటల్ చేయాలని చూస్తుంటే వైసీపీ మాత్రం విశాఖకు రావలసిన అవకాశాలని కోర్టు మెట్లు దగ్గరగా ఆపాలని చూస్తుందని ఆయన విమర్శించారు ఇది కేవలం ప్రతిపక్ష రాజకీయాలు కాదు ఇది యువత భవిష్యత్తుపై దాడి అని ఆయన మండిపడ్డారు గూగుల్ లాంటి ప్రపంచ స్థాయి సంస్థ రాకంటే రాక అంటే రాష్ట్రానికి నమ్మకం పెరగటం వైసీపీ లాంటి పార్టీలు కోర్టు కేసులు వేయడం అంటే పెట్టుబడుతారులకు తప్పుడు సంకేతాలు పంపడమేనని ఆయన విమర్శించారు ఇలాంటి చర్యలతో రాష్ట్ర ప్రతిష్టను దెబ్బ తీయాలని. పెట్టుబడులను రాకుండా అడ్డుకోవాలని. వచ్చిన కంపెనీలను తరిమివేయాలనే కుట్రతో వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు అభివృద్ధిపై పోటీ పడలేక, అభివృద్ధినే అడ్డుకోవాలనే దుష్ట రాజకీయాన్ని వైసీపీ నడుపుతోందని ఆయన విమర్శించారు వైసీపీ అభివృద్ధికి ఉత్తరాంధ్ర యువత ఉపాధికి రాష్ట్ర భవిష్యత్తుకు వ్యతిరేక పార్టీ వైసీపీ అని ఆయన విమర్శించారు అభివృద్ధిని అడ్డుకునే వారి వైఖరిని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించరని ఆయన విమర్శించారు చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని దీన్ని ఎవరు అడ్డుకోలేరని పాతర్ల రమేష్ ధీమా వ్యక్తం చేశారు

# దేశ ప్రజలకు ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యం

**ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**




న్యూఢిల్లీ, నేటి శుభోదయ ::: కేంద్ర ప్రభుత్వం ద్వారా భారతదేశ ప్రజలకు ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం పనిచేస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్లమెంట్ హెల్త్ స్టాండింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం న్యూఢిల్లీలో నిర్వహించిన హెల్త్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధానాలపై విస్తృతంగా చర్చించడం జరిగిందని, ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై సుధీర్ఘంగా చర్చించి, పార్లమెంట్ హెల్త్ స్టాండింగ్ కమిటీ సభ్యుల అభిప్రాయాలు పంచుకోవడం జరిగిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

# ప్రభుత్వ పాఠశాలకు డిజిటల్ సేవలు

**నంద్యాల ఎం పి బైరెడ్డి శబరి**




న్యూఢిల్లీ, నేటి శుభోదయ ::: ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ సదుపాయాల పెంపు పార్లమెంట్ లో బుధవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి విజ్ఞప్తి చేశారు.లోక్ సభలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నంద్యాల జిల్లాతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ సదుపాయాల పెంపు కోసం పార్లమెంట్‌లో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విజ్ఞప్తి చేశారు. నంద్యాల జిల్లాతో పాటు దేశం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన డిజిటల్ విద్య అందించేందుకు వైఫై, ఇంటర్నెట్ కనెక్టివిటీ అత్యంత అవసరమని. ప్రస్తుతం మా పార్లమెంట్ నియోజకవర్గంలో కేవలం 4 పాఠశాలలకే వైఫై సదుపాయం ఉండటం గమనార్హం అని పార్లమెంట్ దృష్టికి ప్రభుత్వం పాఠశాలల విద్యార్థుల సమస్య తీసుకెళ్లారు.నంద్యాల జిల్లాలోని మరిన్ని ప్రభుత్వ పాఠశాలలకు వైఫై కనెక్టివిటీ విస్తరించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ లో సంబంధిత మంత్రిని కోరడం జరిగిందన్నారు.ప్రతి విద్యార్థికి సాంకేతిక విద్య అందుబాటులోకి రావడం మన బాధ్యతఅని, ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్‌గా మార్పు చేసి మరింత బలోపేతం చేయాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభలో కోరారు.

# ఉగాది పండుగ సందర్భంగా ఎంపీపీ శుభాకాంక్షలు



పులిచెర్ల, మార్చి 18,(నేటి శుభోదయ) : మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి, అధికారులకు, వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు, మండల ప్రజలకు ఉగాది పండుగ సందర్భంగా పులిచెర్ల మండల ఎంపీపీ సురేంద్రనాథ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరమైన ఉగాది ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, సంపదలు నింపాలని ఆకాంక్షించారు. మండల ప్రజలందరూ సంతోషంగా, ఐక్యతతో పండుగను జరుపుకోవాలని సూచించారు. మండల అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# జిల్లా పరిషత్ హై స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కొండ్రెడ్డి కిషోర్



జంగారెడ్డిగూడెం మార్చి 18 (నేటి శుభోదయ ప్రతినిధి కోసనం ప్రేమ్ కిరణ్):చింతలపూడి నియోజకవర్గ. శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ సూచనల మేరకు జంగారెడ్డిగూడెం పట్టణ కూటమి నాయకులు స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ మాట్లాడుతూ పాఠశాలలో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న ఆహారం నాణ్యతను స్వయం గా పరిశీలించారు అలాగే వంటశాలను తనిఖీ చేసి పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ వారి చదువులు సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు విద్యార్థులు మంచి లక్ష్యాలు పెట్టుకుని అవకాశాలుకి కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కోనేటి చంటి బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు పీసుపాటిరామలక్ష్మి బిజెపి పట్టణ అధ్యక్షులు తాడికొండ సుధాకర్ హై స్కూల్ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ హై స్కూల్ హెడ్ మాస్టర్ పట్నాల సోమశేఖర్ మరియు ఇతర సభ్యులు పాల్గొనడం జరిగినది

# రొయ్యల రైతుల సమస్యలు పరిష్కరించాలి

**– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్**





ఏలూరు, నేటి శుభోదయ ::: రొయ్యల రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం అన్నే భవనంలో రొయ్యల రైతుల సమస్యలపై ఆయన మాట్లాడారు. ఫీడ్ ధరలు పెరగడం, రొయ్యల ధరలు తగ్గించి వేయడం వలన రొయ్యల రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు నాణ్యతలేని ఫీడ్, సీడ్ వలన రొయ్యల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. యుద్ధం సాకు చూపి రొయ్యల ధరలు తగ్గించి వేయడం దారుణమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రొయ్యల రైతులతో సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఫీడ్ మరియు సీడ్ ధరలపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలన్నారు. నాణ్యమైన ఫీడ్, సీడ్ రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రొయ్యలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులను మోసం చేసే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రొయ్యలు సాగుకు అవసరమైన విద్యుత్ యూనిట్ రూ.1.50 లకు సబ్సిడీ టారిఫ్ ను తక్షణం అమలు చేయాలన్నారు. దేశీయ మార్కెట్ లో రొయ్యల వినియోగం పెంచుటకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. రొయ్యల రైతులు చేస్తున్న ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సంపూర్ణ సంఘీబావం ప్రకటిస్తున్నదని తెలియజేశారు.

# యడ్ల ఉమా శంకర్ ను కలిసిన దాసరి శ్యామ్ చంద్ర శేషు




జంగారెడ్డిగూడెం మార్చి 18 (నేనేటి శుభోదయ ప్రతినిధి కోసనం ప్రేమ్ కిరణ్):ఈరోజు న్యుడిల్లీ లోని విదేశీ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ మరియు ఆంధ్రా యూనివర్సిటీ న్యాయ కళాశాల పూర్వ విద్యార్థి ఆయన మేధస్సుతో ఎంతో మందికి మార్గనిర్దేశం చేస్తున్న గొప్ప వ్యక్తి ప్రపంచ దేశాలతో ఎన్నో దేశం తరపున కీలక విషయాలపై పనిచేస్తున్న యడ్ల ఉమా శంకర్ వారి ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డా. దాసరి శ్యామ్ చంద్ర శేషు బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పితాని ప్రసాద్ తదితరులు ఈసందర్భంగా ఆయనతో అనేక విషయాలపై సంభాషించడం జరిగింది

# జిల్లా ప్రజలందరికీ రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, జిల్లా ఎస్పీ లు ఉగాది శుభాకాంక్షలు



అనంతపురం , నేటి శుభోదయ ::: జిల్లాలోని ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలను జిల్లా ఇంచార్జి మంత్రి టీజీ. భరత్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, శాసన మండలి సభ్యులు, ఎంఎల్ఏ లు, జేసి సి.విష్ణుచరణ్, డిఆర్ఓ మలోల, తదితరులు తెలిపారు. తెలుగువారు జరుపుకునే ఈ ఉగాది పండుగను మనం తెలుగు సంవత్సరాదిగా సాంప్రదాయ బద్ధంగా జరుపుకుంటామన్నారు. సహృద్భావ వాతావరణంలో ప్రజలందరూ జరుపుకోవాలని వారు పిలుపునిచ్చారు.ఉగాది పచ్చడిని ఆరు రుచుల (తీపి, పులుపు, వగరు, కారం, చేదు, ఉప్పు) సమ్మేళనంతో తయారుచేసే ఈ ప్రసాదం ఎంతో విశిష్టమైనదని అన్నారు. తెలుగు సంవత్సరాది ప్రారంభం నుండి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో పాడి పంటలతో సిరి సంపదలతో తుల తూగాలన్నారు. వారికి అంతా మంచే జరగాలని ఆకాంక్షించారు.



# ముస్లిం సోదరులకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు ఇఫ్తార్ విందు



గోకవరం–నేటిసుబోదయ:మండల కేంద్రమైన గోకవరం పాత బస్టాండ్ వద్ద ఉన్న జుమ్మి మసీదు నందు ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గోకవరం మండల పరిషత్ అధ్యక్షులు సుంకర శ్రీవల్లి వీరబాబు ఆధ్వర్యంలో సుమారు 120 మందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం, ఉభయగోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీలు ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని హిందూ ముస్లిం భాయ్ భాయ్ అంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతసామరస్యానికి చిహ్నమైన రంజాన్ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, నియోజకవర్గ,గోకవరం మండల ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి చినబాబు, సుంకర వెంకటరమణ, గల్లా ఏడుకొండలు, సమ్మెట మోహన్, నరాలశెట్టి నరసయ్య, కె.వీర్రాజు,రామకృష్ణ, మడికి మైనర్ బాబు,బత్తుల శ్రీనివాస్, తోలేటి రాంప్రసాద్, బిజ్జి రాజు, బాడితబోయిన చిన్న,మచ్చ మురళి,బొర్రా శేఖర్, నందూరి బుజ్జి రాయి జోగరావు,షేక్ నాగూర్ వల్లీ,సూర్యారావు, కంచుమర్తి రాజశేఖర్, గంద్రెడ్డి నాని, తుమ్మల రామారావు,తలాటి నాగేందుడు, అబ్బిరెడ్డి చిన్ని,యేసు,జి.ధనుంజయ, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్ అడపా వెంకటరమణ(బాబ్జి) 4వ వర్ధంతి కార్యక్రమం

-ప్రజా సేవే లక్ష్యంగా పనిచేసిన నాయకుడు అడపా బాబ్జి

: వైయస్సార్ సిపి నాయకులులి

-=కలపల కిరణ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



గుడివాడ, మార్చి18 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు,మాజీ కౌన్సిలర్ అడపా వెంకటరమణ(బాబ్జి) 4వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.ఏజికే స్కూల్ వద్ద అడపా బాబ్జి విగ్రహానికి పార్టీ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజ సమస్యల పరిష్కారంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారని గుర్తు చేసుకున్నారు.సామాన్య కార్యకర్తలకు సైతం అందుబాటులో ఉంటూ,నియోజకవర్గ అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అడపా బాబ్జి చేసిన సేవలు చిరస్మరణీయమని వైఎస్ఆర్సీపీ నాయకులు కొనియాడారు.పార్టీ బలోపేతానికి బాబ్జి గారు నిరంతరం కృషి చేశారని,బాబ్జి తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు.అడపా బాబ్జి వర్ధంతి కార్యక్రమం సందర్భంగా స్థానిక ఏజికే స్కూల్ సమీపంలో కలపాల కిరణ్ మిత్రబృందం ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి పేదలకు,బాటసారులకు భోజనాలు పంపిణీ చేశారు.అడపా బాబ్జి ఎప్పుడూ ప్రజా సేవే లక్ష్యంగా పనిచేశారని, ఆయన స్మారకార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషమని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ సిపి పట్టణ అధ్యక్షులు గొర్ల శీను,సీనియర్ నాయకులు పాలేటి చంటి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు మెరుగుమాల కాళీ,మల్లిపూడి చక్రవర్తి,అద్దేపల్లి పురుషోత్తం,అడబాల అప్పారావు,రేమల్లి నీలాకాంత్, చింతల భాస్కర్ రావు, చుండూరి శేఖర్, కొంకితల ఆంజనేయ ప్రసాద్,ఎస్ కే బాజీ,ధనియాలపేట భాష,గుదే రవి,యార్లగడ్డ మురళి,తోట సాయి,క్రేన్ బాబి,మాదాసు వెంకటలక్ష్మి,మూడేడ్ల ఉమా,హారిక,రమీజా,సురేఖ, తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**'దివ్యాంగ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్**

నంద్యాల మార్చి 18 (నేటి శుభోదయ నంద్యాల జిల్లా ప్రతినిధి నాగేంద్ర) దివ్యాంగులు సమాజంలో ఆత్మగౌరవంతో, సమాన అవకాశాలతో జీవించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంద్రధనుస్సు' కార్యక్రమంలో భాగంగా 'దివ్యాంగ శక్తి' (ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం) పథకాన్ని స్థానిక నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి ఫరూక్ దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ రాష్ట్రవ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు 100% ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా వారిపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, వారు స్వేచ్ఛగా తిరిగేలా ప్రభుత్వం భరోసా ఇస్తోందని తెలిపారు . ఈ పథకం ద్వారా దివ్యాంగులు విద్య, ఉపాధి, మరియు ఆరోగ్య అవసరాల కోసం ఎక్కడికైనా సులభంగా వెళ్లవచ్చు అని . ఇది వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అన్నారు . ఏ ఒక్క పౌరుడు వివక్షకు గురికాకూడదనే లక్ష్యంతో, అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్న ముఖ్యమంత్రి గారి సంకల్పానికి ఈ కార్యక్రమమే నిదర్శనం అన్నారు. అనంతరం మంత్రి ఫరూక్ లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖి నిర్వహించి, పథకం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. 10వ తరగతి పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ అంతరాయం లేని మార్గాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , రజియా సుల్తానా, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్, నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రమణయ్య స్థానిక క్లస్టర్ మరియు యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, ఏపీఎస్ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో దివ్యాంగ లబ్ధిదారులు పాల్గొన్నారు.

### జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోండి

## మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్



నంద్యాల మార్చి 18 నేటి శుభోదయ: నంద్యాల జిల్లా ప్రతినిధి నాగేంద్ర :గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నంద్యాలలో మార్చి 25 తేదీ స్థానిక ఎన్టీఆర్ షాది ఖానా నందు జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ తెలిపారు ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ ను డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి , ప్లేస్మెంట్ ఆఫీసర్ సుబ్బన్న , స్కిల్ హబ్ కోఆర్డినేటర్ మస్తాన్ వలి తో కలిసి మంత్రి ఎన్ఎండి ఫరూక్ పోస్టర్లను రిలీజ్ చేశారు ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ మరియు చుట్టుపక్కల ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు . 13 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొనబోతున్నాయని . దాదాపు 920 పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు . నిరుద్యోగులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని ప్రతి నెల జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు . 20 లక్షల ఉద్యోగాలు ఐదు సంవత్సరాలలో ఇవ్వాలనేదే తెలుగుదేశం పార్టీ ఆశయమన్నారు . ఈ ఆశయానికి అనుగుణంగా మంత్రివర్యులు నారా లోకేష్ గారు సారథ్యంలో ఖచ్చితంగా సాధిస్తామని ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు అలాగే నాకు తెలిసిన హైదరాబాద్ కంపెనీస్ కూడా నంద్యాలకు తీసుకుని వచ్చి జాబ్ మేళా నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు

## రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది.



నేటి శుభోదయ - వెలుగోడు:నంద్యాల జిల్లా ప్రతినిధి నాగేంద్ర రైతు బాగుంటేనే దేశం ముందుంటుందని టిడిపి నాయకులు అన్నారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 3వ విడత నిధులు విడుదల సందర్భంగా రైతన్న మీ కోసం వారోత్సవాలను మండలం లోని మాధవరం , వెలుగోడు గ్రామాలలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద 2000 మరియు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద 4000 మొత్తం కలిపి 6000 ఈ సంవత్సరం గాను 20000 రైతుల ఖాతాలో వేయడం జరిగిందని , ఇందులో భాగంగా టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రతి ఇంటి దగ్గరికి వెళ్లి ప్రజల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ డబ్బుల గురించి, రైతులకు ప్రభుత్వం చేస్తున్న మంచి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి స్వాతి , మార్కెట్ యార్డ్ చైర్మన్ వంగాల కృష్ణారెడ్డి , టిడిపి మండల అధ్యక్షులు కలాం,భూపాల్ చౌదరి , శివశంకర్, టిడిపి టౌన్ ప్రెసిడెంట్ మోమిన్ రసూల్, యూనిట్ ఇంచార్జ్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, అగ్రికల్చర్ అధికారులు రైతులు పాల్గొన్నారు.

# ప్రేమ,దయ,సహనం,సంతోషల కలయికే రంజాన్

-వైయస్సార్ సిపి కృష్ణా జిల్లా మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ ఖాసిం అబు ఆధ్వర్యంలో రంజాన్ ఇఫ్తార్ విందు

-మస్జిద్ -ఏ-అక్సా మసీదులో ముస్లిం సోదరులతో కలిసి"నమాజ్" చేసిన కొడాలి నాని.

-అల్లా ఆశీస్సులతో అందరూ బాగుండాలి కొడాలి నాని

-ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు విరమణ ఇఫ్తార్ విందును స్వయంగా వడ్డించిన కొడాలి నాని

-మైనార్టీ సోదరుల అభివృద్ధికి కట్టుబడి అత్యున్నత పదవులను కేటాయించిన పార్టీ వైయస్సార్ సిపిలి



గుడివాడ, మార్చి 18 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వైఎస్ఆర్ సీపీ కృష్ణా జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఖాసిం అబు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నానికి ఘన స్వాగతం పలికిన మైనార్టీ నాయకులు ముస్లిం సాంప్రదాయ ప్రకారం సత్కరించారు.అనంతరం ముస్లిం మత పెద్దలు,సోదరులతో కలిసి సామూహిక ప్రార్థనల్లో పాల్గొని,వారికి ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్ష చేస్తారని, క్రమశిక్షణకు, దాతృత్వానికి,మత సామరస్యానికి పవిత్ర రంజాన్ మాసం ప్రతీక అని హిందూ,ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసి ఉండే సంప్రదాయం మనదని, పండుగలు మత సామరస్యానికి ప్రతీకలని,అన్ని వర్గాల వారు ఐక్యతను చాటుతూ ఇఫ్తార్ విందులో పాల్గొనటం చాలా సంతోషం అన్నారు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో మైనారిటీల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.రాజకీయంగా మైనార్టీలకు ఎన్నడూ లేని విధంగా అత్యున్నత పదవులను కేటాయించారని,రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఒక ముస్లిం మైనార్టీ నాయకుడికి ఉప ముఖ్యమంత్రి పదవిని,శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా మైనార్టీ మహిళను నియమించారన్నారుమసీదుల్లో ఇమామ్‌లకు రు.10,000, మౌజన్‌లకు రు.5,000 నెలవారీ గౌరవ వేతనం అమలు చేశారని,ముస్లిం యువతుల వివాహానికి ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రు.1,00,000 కు పెంచి ఇందులో వధువు, వరుడు ఇద్దరూ పదో తరగతి పాస్ కావాలనే నిబంధన పెట్టి విద్యను ప్రోత్సహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూను రెండో అధికారిక భాషగా గుర్తించి, పాఠశాలల్లో ఉర్దూ విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించారు.పేద ముస్లిం కుటుంబాలకు అండగా ఉండటంలో తమ పార్టీ ఎప్పుడు ముందుంటుందని స్పష్టం చేశారు.ఉపవాస దీక్షలు విరమణ సందర్భంగా ముస్లిం సోదరులకు కొడాలి నాని స్వయంగా ఇఫ్తార్ విందును వడ్డించి,వారితో కలిసి విందులో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను,సీనియర్ నాయకులు పాలేటి చంటి,గంట శీను,యార్లగడ్డ సత్య భూషణ్,అడబాల అప్పారావు,చింత నాని,చింతల భాస్కరరావు,రవి స్వీట్స్ మోహన్,రేమల్లి నీలాకాంత్, కొంకితల ఆంజనేయ ప్రసాద్,కలపాల కిరణ్,కరీముల్లా బేగ్,బాబులు బేగ్,సర్దార్ బేగ్,రషీద్,షమ్ము,జివిస్టి భాష,ఇబ్రహీం,అజిస్,ఎండి రఫీ,అబ్దుల్ రజాక్, సయ్యద్,ఇనాయతుల్లా,రహిమ,సద్దాం,ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



# ఆయ్యా ఇరు రెండు తెలుగు రాష్ట్రాల సీఎం సార్లు

-మా డ్యూటీలు ఇక్కడ, మా కుటుంబాలు అక్కడ

- హోంగార్డుల కన్నీటి గాథలు విన్నండి

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో పనిచేస్తున్న హోం గార్డులను సొంత రాష్ట్రాలకు బదిలీలు చేయండి

- రెండు రాష్ట్రాల డీజీపీలకు విన్నపాలు

- ఇరు రెండు రాష్ట్రాల గవర్నమెంట్లకు హోంగార్డులు వేడుకోలు

అమరావతి, హైదరాబాద్ నేటి శుభోదయ ::: రెండు తెలుగు రాష్ట్రాల సీఎం లకు ఆంధ్రా స్థానికత గల హోంగార్డుల ఆంధ్ర బదిలీకి సమ ఆలోచనలు చేసి ఎక్కడి రాష్ట్ర వారిని అక్కడికి బదిలీలు చేయాలని ఇటు తెలంగాణ,అంటూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలకు హోం గార్డులు వేడుకుంటున్నారు. డ్యూటీలు ఇక్కడ, ఫ్యామిలీలు అక్కడ ఉండడంతో హోం గార్డులు డ్యూటీలు చేస్తూ సతమతమవుతున్నారు.అదే విధంగా ఆంధ్రప్రదేశ్ స్థానికతకు చెంది తెలంగాణాలో పనిచేస్తున్న హోం గార్డులను సొంత రాష్ట్రానికి బదిలీ చేసేలా ఏపీ అదేవిధంగా, ఏపీలో డ్యూటీలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర హోంగార్డులను తెలంగాణకు పంపియాలని ఇరు రెండు రాష్ట్రాల గవర్నమెంట్లను హోం గార్డులు వేడుకుంటున్నారు. అంతేకాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హోం గార్డు ఉద్యోగాలకు సెలక్ట్ అయ్యామని, రాష్ట్ర విభజన జూన్, 2014 జరిగిన తరువాత మేము తెలంగాణలో ఉండిపోవలసి వచ్చిందని హోంగార్డులు వివరించారు. అన్ని ప్రభుత్వ శాఖలలో ఉద్యోగులను వారి స్థానికత ప్రకారం మార్చడం జరిగిందని, కాని హోంగార్డులను మార్చలేదని, హోంగార్డులు ఆవేదన చెందుతున్నారు. మా కుటుంబాలు ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. దీని వల్లన మేము ఉద్యోగం చేయాలంటే కన్నీటి గాథలు వినిపిస్తున్నారు. తెలంగాణలో దాదాపుగా 200 మంది హోంగార్డులు ఉన్నారు. అదేవిధంగా ఆంధ్రలో కూడా దాదాపు 200 మంది తెలంగాణ వాళ్ళు ఉన్నారు. డ్యూటీలు అక్కడ కుటుంబాలు ఇక్కడ ఉండటం వలన, మానసికంగా, కుటుంబపరంగా, డ్యూటీకి రవాటానికి రవాణా పరంగా, ఆర్థికంగా పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాము. మా తల్లితండ్రులు వృద్దాప్యంలో ఉండటం వలన, మేము వారిని చూసుకోలేకపోతున్నాం. ఆంధ్రప్రదేశ్ కు చెందిన మేము తెలంగాణలో ఉంటున్నాము. మాలో కొంతమంది పిల్లలు తెలంగాణలో చదువుతున్నారు. భవిష్యత్తులో వాళ్ళు ఆంధ్రప్రదేశ్ స్థానికతను కోల్పోవాల్సిన ఇబ్బందులు కలుగుతున్నాయి. కాబట్టి మేము వేడుకుంటున్నాం అని ఆంధ్ర స్థానిక కలిగిన హోంగార్డ్స్ సంఘం కూడా ఇటీవల ప్రభుత్వానికి విన్నపాన్ని మీడియా,పత్రికల ద్వారా తెలియజేయడం కూడా జరిగింది.ఇంత సున్నితమైన అంశాన్ని కొన్ని తరాలుగా ఉన్న స్థానికతను కోల్పోయే అంతటి పరిస్థితిని ప్రభుత్వాలు తీసుకొని రావడం సరైనది కాదని మేధావులు ప్రజా సంఘాలు అభిప్రాయపడుతున్న తరుణంలో ఇటువంటి స్వల్ప విషయాలపై ప్రభుత్వాలు తీరు విస్మయాన్ని కలిగిస్తుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్న తరుణంలో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించి అల్పాదాయ ఉద్యోగులుగా శాశ్వత సేవలు అందిస్తున్న హోంగార్డ్స్ ఉద్యోగాలను పూర్తి స్థాయిలో న్యాయం చేయవలసిన ఆవశ్యకత లేకపోలేదని న్యాయవాదులు ఇప్పుడు స్కూల్లో స్టార్ట్ అయితే మాకు స్కూల్లో స్టార్ట్ అటు ఇటు కాకుండా పోతాం ఈ స్కూల్ ఓపెన్ అయ్యే లోపల మాకు న్యాయం జరపాలని ఎంతోమంది ఆఫీసులను ఎంతోమంది ప్రజాప్రతినిధులను కలిశాం అని ఈ పని నిమ్మ నిరుత్తినట్టుగా ఉంది అని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికీ పట్టించుకోవడం లేదు. వాళ్ళు ఎన్నో తిప్పలు పడ్డారు కానీ ఆఫీసర్లు ఎందుకు దీన్ని జాప్యం చేస్తుంద్రు వాళ్లకు న్యాయం చేయాలని కోరుకుంటున్నారు. అభిప్రాయపడుతున్నారు.కావున ఇప్పటికైనా ఆశిద్దాం ఇరు రెండు ప్రాంత రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తక్షణమే ఈ సున్నితమైన అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేస్తుందని మేమందరం వేడుకుంటున్నాం.

## జాతీయ నాయకులు ఈ తరానికి గుర్తుండిపోవాలి.



నేటి శుభోదయ -వెలుగోడు:నంద్యాల జిల్లా ప్రతినిధి నాగేంద్ర ఈ ఆధునిక ప్రపంచం లో పురాణాల కథలు , రాజుల పరిపాలన , సాంఘిక , పౌరాణిక ఘట్టాలు , స్వాతంత్ర్య పోరాట నాయకులు నేటి తరం విద్యార్థులు మరిచిపోతున్నారు. వారికీ అన్ని గుర్తుకు వచ్చేలా వెలుగోడు పట్టణ లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం యాజమాన్యం బుధవారం నాడు పాఠశాలలో స్వాతంత్ర సమరయోధులు, జాతీయ నాయకుల వేషధారణలతో వారి ఆహాభావాలను ప్రదర్శించి విద్యార్థుల కు పాత తరం నాయకులను మళ్ళీ ఒకసారి గుర్తించు కునేలా చేశారు. ఈ వేషధారణలో మహాత్మా గాంధీ, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి, రాజా రామ్మోహన్ రాయ్, పండిత్ జవహర్ లాల్ నెహ్రూ ,డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, సరోజినీ నాయుడు, సర్దార్ వల్లభాయ్ పటేల్, భగత్ సింగ్, లాలా లజపతిరాయ్, బాలా గంగాధర తిలక్, మొదలగు స్వాతంత్ర సమరయోధులు జాతీయ నాయకుల వేషధారణల తో విద్యార్థులు ఆహా భావాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.ఎఫ్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ నేటి విద్యార్థులకు మన దేశ సంస్కృతి, దేశ స్వాతంత్రం కోసం స్వాతంత్ర సమరయోధులు చేసిన ధైర్య సాహసాలు, నాటి జాతీయ నాయకులు దేశ కోసం చేసిన సేవలు నేటి విద్యార్థులకు కూడా గుర్తుపెట్టుకోవాలని మంచి ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ఏవో అప్పియ ప్రశాంత, అనిల్, జోసెఫ్ రిచర్డ్ సన్, ఫిరోజ్, అబ్దుల్ సలీం,ఉపాధ్యాయ బృందం కృషి తో విజయవంతమైందన్నారు.

## జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ గా వెలుగోడు వాసి



నేటి శుభోదయ వెలుగోడు :నంద్యాల జిల్లా ప్రతినిధి నాగేంద్ర :వెలుగోడు పట్టణానికి చెందిన అడ్వకెట్ గౌడుగు రవి కుమార్ ను ఆళ్లగడ్డ స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్గ , అలాగే శ్రీశైలం కు చెందిన అడ్వకెట్ గిరిబాబు ను నంద్యాల రైల్వే స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గా హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా జడ్జి నియమించారు. ఎన్నికైన రవిని , గిరిబాబు లను ఆత్మకూరు బార్ అసోసియేషన్ తరపున న్యాయవాదులు ఘనంగా సన్మానం చేశారు.అలాగే స్నేహితులు , కుటుంబ సభ్యులు , ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

## గ్యాస్ కష్టాలు ప్రజలకు ఎప్పుడు తిరేనో!

నేటి శుభోదయ వెలుగోడు :నంద్యాల జిల్లా ప్రతినిధి నాగేంద్ర ప్రజలకు గ్యాస్ కష్టాలు రోజు, రోజూ కు ముదురు తున్నాయి. ఇరాన్ , అమెరికా యుద్ధం నేపథ్యం లో గ్యాస్ నిల్వలు సరిపోవడం లేదు. వెలుగోడుకు చెందిన లతా హెచ్. పి గ్యాస్ ద్వారా వెలుగోడు, గడివేముల, బండి ఆత్మకూరు మండలాలకు గ్యాస్ సరఫరా చేస్తున్నారు. ఈ మూడు మండలం లో సుమారు 26, 700 కనెక్షన్స్ ఉన్నాయి. వీరికి బుక్ చేసుకున్న రెండు రోజుల్లో గ్యాస్ డెలివరీ ఇచ్చేవారు. ఇపుడు దాదాపు పది రోజులు పడుతుంది. బుక్ చేసుకున్న వారికీ 12తేది వరకు ఇచ్చామని, 13 తేది నుంచి బుక్ చేసుకున్న వారికీ బిల్లు ఇవ్వడం లేదని, గ్యాస్ ఇవ్వలేదని గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులు తెలిపారు. నేటి వరకు సుమారు 4250 మందికి బుక్ చేసుకున్న, డెలివరీ కాక పెండింగ్ లో ఉన్నట్లు చెప్పారు. కొందరు బుక్ చేసుకున్నారు. కానీ గ్యాస్ వద్దన్నారు. వీరు సుమారు 1400 వరకు ఉన్నారు.ఈకెవై సి చేసుకొని వారికీ బుకింగ్ కాదని, వెంటనే వారు ఈ కె వై సి చేసుకోవాలని నిర్వాహకులు చెప్పారు. గతం లో ప్రతి రోజూ 400 నుంచి 500వరకు బుకింగ్ చేసుకునే వారు. ఇపుడు గ్యాస్ ఇబ్బంది ఉంటుందని బుకింగ్ పెరిగిందని , 800 నుంచి 900వరకు బుక్ చేసుకుంటున్నట్లు చెప్పారు. 5 కిలోమీటర్లు లోపు గ్యాస్ బుకింగ్ చేసుకున్న వారికీ డెలివరీ చార్జెస్ లో మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా కూడా మీరు ఎందుకు వసూలు చేస్తున్నారన్న ప్రశ్నకు , డెలివరీ బాయ్ కి జీతాలు , డిజల్ ఖర్చులు వస్తున్నందున వసూలు చెప్పడం వింతగా ఉంది.సిలిండర్ డెలివరీ చేసే సమయం లో వినియోగదారుకుని గ్యాస్ బండ తూకం వేసి ఇవ్వాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా, అలా ఇవ్వడం లేదని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. గ్యాస్ ఎజన్సీ కేంద్రాన్ని బుధవారం రెవిన్యూ ఇన్స్పెక్టర్ తనిఖీ చేశారు. బుకింగ్ చేసుకొని డెలివరీ తీసుకొని వారిని లిస్ట్ లో నుంచి తొలగించి, వారి స్థానం లో బుక్ చేసుకున్న వారికీ వెంటనే ఇవ్వలని ఆదేశించారు. ఒక్కో సిలిండర్ పై 300 రూపాయలు ఎక్కువ వసూలు చేసి, వెంటనే డెలివరీ బాయ్స్ చేస్తున్నారన్న ప్రశ్నకు ఇంతకు ముందు జరిగింది. ఇప్పుడు ప్రతిదీ చెక్ చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.






## మున్సిపల్ టీలో అసిలు దందా అధిక ధరలకి అసిలు వసూళ్లు

**నష్టం మాత్రం రోడ్లపై వ్యాపారం చేసే చిరు వ్యాపారులకు**



జంగారెడ్డిగూడెం మార్చి 18 (నేటి శుభోదయ ప్రతినిధి కోసనం ప్రేమ్ కిరణ్ ):జంగారెడ్డిగూడెం లో కొనసాగుతున్న మున్సిపల్ అసిలు దందా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా అధిక ధరలకి అసిలు వసూళ్లు కొబ్బరి బొండాల ద్విచక్ర వాహనం వద్ద యాబై రూపాయలు వసూళ్లు బిల్లు లు కూడా ఇవ్వకుండా ఆసీలు వసూలు చేయడం వెనక అనేక అనుమానాలు జంగారెడ్డిగూడెం పంచాయితీ నుండి మున్సిపల్ వరకు ఎదిగిన ఒక్క వ్యక్తి మాత్రమే దక్కించుకుంటున్న ఆసిలు పాట ఆసీలు వసూలు చేయడం వెనక అనేక అనుమానాలు కానీ చర్యలు మాత్రం శూన్యం అదే పాట దారుడు అదే దందా కానీ నష్టం మాత్రం రోడ్లపై వ్యాపారం చేసే చిరు వ్యాపారులుకనీసం నలబై రూపాయలు తీసుకోమని ఇచ్చిన కూడా యాబై రూపాయలు బలవంతంగా వసూలు చేయడం ఎంత వరకు కరెక్ట్ అంటారు అధికారులకి మాత్రం మేము నిభంధనల ప్రకారం వసూలు చేస్తున్నాము అని బిల్లు లు సద్మిట్ చేస్తున్నారుకానీ వాస్తవ పరిస్థితల్లో వ్యాపారులకు బిల్లు లు ఇవ్వడం లేదు ఒక వేళ బలవంతంగా బిల్లు అడిగితే ఇస్తున్నారుఎలా ఇస్తున్నారు అంటే దానిమీద ముద్ర ఉండదు ఎంత అమౌంట్ కట్టించుకుంటారో ఉండదుఒక సంతకం పెట్టీ ఇచ్చేస్తారు కొందరు స్వయంగా గతంలో బిల్లు వసూలు చేసే వ్యక్తి దగ్గర రెండు రకాల బిల్లు బుక్కులు చూసారు మరి రెండు దీనికి వాడతారో వాళ్ళకే తెలియాలి

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు లో పాల్గొన్న ఎమ్మెల్యే

**కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి**



నేటి శుభోదయ / డోన్ నియోజకవర్గ ప్రతినిధి : డోన్ నియోజకవర్గం ప్యాపిలి పట్టణంలోని జామియా మస్జిద్ వేదికగా, ముస్లిం సోదరుల పట్ల ఉన్న ప్రేమను చాటుకుంటూ నిర్వహించిన ఇఫ్తార్ విందు అత్యంత వైభవంగా జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథి ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి,తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా మైనారిటీ జనరల్ సెక్రటరీ కాజా పీర్ గారి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు 100 మంది మైనారిటీ సోదరులకు రంజాన్ తోఫా కిట్లను అందజేయడం జరిగింది. అలాగే అక్కడి నుంచి జామియా మసీదుకు వెళ్లి ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్న కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి , స్వయంగా వడ్డించి అందరినీ ఆత్మీయంగా పలకరించారు. మత సామరస్య కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండాలని, ఈ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోట్ల వారు ఆకాంక్షించారు. ఈ వేడుకలో ప్యాపిలి మండల నాయకులు, పట్టణ ప్రముఖులు, మరియు మైనార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

శుభోదయ
## సంపాదకీయం

# దయనీయుడు కాకూడదు!

**(విశ్లేషణ)**

'మానవుడే మహనీయుడు, శక్తియుతుడు, యుక్తిపరుడు, మానవుడే మాననీయు' డంటాడు కవి ఆరుద్ర ఒక సినీ గీతంలో! సందేహమేముంది? ఆయనే అన్నట్టు, మంచిని తలపెడితే మనిషికి అడ్డే లేదు, దివిజ గంగ భువి దించిన భగీరథుడు మానవుడే, సృష్టికి ప్రతిసృష్టి చేయు విశ్వామిత్రుడు నరుడేబీ చంద్రలోకమైన, దేవేంద్రలోకమైన బొందితో జయించి భువికి తిరిగి రాగలిగినవాడూ మానవుడే! కానీ, అంతటి మహనీయుడు కూడా ఒక్కోసారి దయనీయుడైపోతాడు. ఎంతో ముందుకు చూడగలిగి కూడా తరచూ హ్రస్వ దృష్టికి లోనవుతాడు. పదిమందికీ మంచిని తలపెట్టేవాడు కూడా స్వప్రయోజనాన్ని మరిగి చివరికి సొంతానికే చేటు తెచ్చుకుంటాడు. సర్వతోముఖ వికాసం మనిషికి వరమే కానీ, తనకు తనే చెరుపు చేసుకునే బహుముఖ వైఫల్యం పెనుశాపం. అసాధారణ వర్షాల కారణంగా హిమాలయ ప్రాంత రాష్ట్రాలు అతలాకుతలమవుతున్నాయి. హఠాత్తుగా అతివృష్టి, మెరుపు వరదలు, మట్టిపెళ్ళలు విరిగిపడటం వగైరా ఉత్పాతాల కారణంగా ఈ సంవత్సరం ఇప్పటికి దాదాపు మూడు వేల మంది మరణించారు, లక్షల కోట్ల విలువైన ఆస్తినష్టం సంభవించింది. అడ్డూ అదుపూ లేని పట్టణాభివృద్ధి, అడవుల నిర్మూలన, రోడ్ల నిర్మాణం, విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన మొదలైన అభివృద్ధి చర్యలను ఇందుకు కారణంగా పర్యావరణ వాదులు ఎత్తిచూపుతున్నారు. ఇటువంటివి లేని రోజుల్లో కూడా ఇలాంటి ప్రమాదాలు జరిగిన సంగతిని కొందరు ఉదాహరిస్తున్నారు. కారణమేమైనా ప్రాణనష్టం, ఆస్తినష్టం కళ్లముందు కటిక నిజాలు. పటిష్ఠమైన ముందస్తు హెచ్చరిక యంత్రాంగాన్ని ఇప్పటికీ ఏర్పరచుకోలేక పోవడం – దీనంతటి వెనుకా మహనీయుడైన మానవుడి పరంగా చెప్పుకోవలసిన ఒకానొక వైఫల్యం. దీనికితోడు, దేశంలో ప్రకృతి విపత్తులకు గురికాగల ప్రాంతాల గురించిన గణాంకాలు గుండె గుభేలుమనిపిస్తాయి. ఏకంగా 27 రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాలూ ఇందులోకి వస్తాయి. వ్యవసాయ యోగ్యమైన 68 శాతం భూమి ఏ క్షణంలోనైనా అనావృష్టికి గురికావచ్చు, 15 శాతం ప్రాంతంలో ఉన్నట్టుండి రాళ్ళవర్షం కురవచ్చు, 12 శాతం ప్రాంతంలో మెరుపు వరదలు సంభవించవచ్చు. ఈ విపత్తులు ఏటా పెరగడమే తప్పే తగ్గే అవకాశం లేదట! శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక అభివృద్ధిలో మానవుడి బుద్ధి ఎంతో చురుగ్గా పని పనిచేయడం ఎంతైనా శ్లాఘనీయమేబీ అభివృద్ధిని ప్రజలకు మరింత సుఖమయ జీవన యోగ్యంగా మలచే దిశగా శరవేగంతో కదలడమూ అభినందనీయమేబీ కానీ, దానిని అంటిపెట్టుకుని వచ్చే సమస్యల నివారణలో మాత్రం అతని అడుగు చురుగ్గా పడటం లేదు. దాంతో అభివృద్ధి అస్తవ్యస్తానికీ, అభద్రతకూ చిరునామా అవుతోంది. దేశంలోని మహా నగరాలలో రోడ్ల పరిస్థితే ఇందుకు మరో ఉదాహరణ. ఆయా నగరాలలో జనాభా పెరుగుదలా, కొత్త జనావాసాల విస్తరణా, రాకపోకల అవసరాలూ, వాహనాల పెంపూ విమాన వేగాన్ని అందుకున్నాయిబీ కానీ, ఆ దామాషాలో రోడ్ల నిర్వహణా, ఇతర వసతుల కల్పనలో ప్రభుత్వాల ప్రణాళికలు ఎడ్లబండి వేగంతో నడుస్తున్నాయి. అనేక నగరాలలో రాకపోకల రద్దీ ఎంతటి సమస్యాత్మక స్థాయికి చేరిందంటే, జనం గంటల తరబడి కాలాన్ని ట్రాఫిక్ జామ్ లోనే గడపవలసి వస్తోంది, ఎంతో విలువైన ఉత్పాదక సమయం రోడ్లపాలైపోతోంది. రకరకాల జీవనోపాధి పనుల మీద తిరిగే జనాలను అది మానసికంగా విపరీతమైన ఒత్తిడికి గురిచేసి ఆర్థిక సమస్యలతోపాటు ఆరోగ్య సమస్యలనూ తెచ్చిపెడుతోంది. ఈ ఏడాది తొలి అయిదారు మాసాల్లోనే దేశవ్యాప్తంగా నగరాల రోడ్లపై సంభవించిన దుర్ఘటన మరణాలు వేలసంఖ్యను దాటిపోయాయి. అయినాసరే, పౌరరవాణా సదుపాయాల అభివృద్ధీ వగైరాలు కాగితాల దశను దాటి కార్యరూపం ధరించడానికి ఏళ్లూపూళ్లూ పట్టిపోతోంది. మొత్తంమీద కవి చెప్పినట్టు గ్రహరాశుల నధిగమించి ఘనతారల పథము తొక్కగలిగిన మహనీయుడే తన లోకాన్ని సర్వతోభద్రంగా మార్చుకోవడంలో విఫలమవుతున్నాడు. మనిషి జైత్రయాత్రలో ఎక్కడో అడుగు తడబడి అపజయపు దారి పడుతోంది. తనను దయనీయుడిగా రూపుకట్టే ఆ తడబాటును సరిదిద్దుకుని మహనీయుడన్న ఖ్యాతి నిలుపుకోవడం మనిషి తక్షణావసరం

# డబ్బుఉందా? డెబిట్! లేదా క్రెడిట్!

**స్వైప్ ఒకటే.. స్టైల్ రెండు**
**భారత్‌లో డెబిట్-కమ్-క్రెడిట్ కార్డు**
**చెల్లింపుల్లో కొత్త ట్రెండు**
**ఒకే 16 అంకెల నంబర్‌తో డెబిట్, క్రెడిట్ రెండూ**
**డిజిటల్ పేమెంట్స్‌లో 'ఫ్లెక్సిబుల్' అడుగు`వీసా కార్డు గేమ్‌చేంజర్**




భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ మరో కీలక మలుపు తీసుకుంటోంది. అంతర్జాతీయ చెల్లింపుల దిగ్గజం వీసా త్వరలో భారత్‌లో ఒకే కార్డుతో అటు డెబిట్‌కి, ఇటు క్రెడిట్‌కి రెండు విధాలుగా ఉపయోగపడేలా 'డెబిట్--కమ్--క్రెడిట్ కార్డు'ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ కొత్త విధానం వినియోగదారులకు సౌకర్యాన్ని పెంచడమే కాకుండా, దేశంలో క్రెడిట్ వినియోగాన్ని విస్తరించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

### యూపీఐ, డెబిట్, క్రెడిట్ కార్డులతో పోలిస్తే

ప్రస్తుతం భారత్‌లో యూపీఐ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, అది ప్రధానంగా బ్యాంక్ సేవింగ్స్ ఖాతా నుంచి నేరుగా డబ్బు కట్ అయ్యే విధానమే. డెబిట్ కార్డులు కూడా ఖాతాలో డబ్బు ఉంటేనే పనిచేస్తాయి. మరోవైపు, క్రెడిట్ కార్డులు సౌకర్యవంతమే అయినా వాటి వినియోగం డిజిటల్ రూపంలో,యూపీఐ చెల్లింపుల విషయంలో ఇంకా పరిమితంగానే ఉంది. ఈ నేపథ్యంలో వీసా తీసుకొస్తున్న కొత్త కార్డు యూపీఐతో అందే సౌలభ్యం, డెబిట్ కార్డుతో చేయగల నియంత్రణ, క్రెడిట్ కార్డు ఫ్లెక్సిబిలిటీ ఈ మూడింటినీ కలిపిన ఉపయోగకరమైన సాధనంగా మారనుందని విశ్లేషకులు అంటున్నారు.

### బ్యాంకులు, వినియోగదారులకు లాభాలు

ఈ కొత్త విధానం ద్వారా బ్యాంకులు తమ రిస్క్ పాలసీలకు అనుగుణంగా క్రెడిట్ వినియోగాన్ని నియంత్రించగలుగుతాయి. వినియోగదారులకు మాత్రం ఒకటి కంటే ఎక్కువ కార్డులని ప్రతిచోటుకూ మోసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. ముఖ్యంగా స్థిర ఆదాయం ఉన్నా క్రెడిట్ కార్డు లేని మధ్య తరగతి వర్గానికి ఇది ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది.

### ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

నిపుణుల అంచనాల ప్రకారం, ఈ విధానం నగదు వినియోగాన్ని తగ్గించడంలో, టైర్--2, టైర్--3 నగరాల్లో కార్డు వినియోగాన్ని పెంచడంలో, ఫార్మల్ ఎకానమీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అయితే, అతిగా క్రెడిట్ వినియోగం వల్ల వినియోగదారుడు అప్పుల ఊబిలో కూరుకునే ప్రమాదం కూడా ఉందని, అందుకే ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వీసా ప్రతిపాదిస్తున్న ఈ డెబిట్--కమ్--క్రెడిట్ కార్డు భారత్ చెల్లింపుల వ్యవస్థను మరింత స్మార్ట్‌గా, ఫ్లెక్సిబుల్‌గా మార్చే విధానంగా పరిగణించవచ్చు. ఇది వినియోగదారుల సౌకర్యం, బ్యాంకులకు భద్రత ఈ రెండింటికీ మధ్య సమతుల్యత తీసుకురావచ్చని విశ్లేషకుల అభిప్రాయం.

### కార్డు కాదు కాంబోప్యాక్

వీసా అభివృద్ధి చేసిన 'ఫ్లెక్సిబుల్ క్రెడెన్షియల్ (వీసా ఫ్లెక్స్)' టెక్నాలజీ ఆధారంగా ఈ కార్డు పనిచేస్తుంది. 16 అంకెల ఒకే కార్డు నంబర్ ద్వారా కస్టమర్ లావాదేవీ చేసే సమయంలో అది అవసరాన్ని బట్టి డెబిట్‌గా లేదా క్రెడిట్‌గా వాడుకోవచ్చు. చెల్లింపు ఎలా జరగాలన్నది కస్టమర్ కొనుగోలు చేసే విలువ మొత్తం, లేదా వినియోగదారు ముందుగా ఎంచుకున్న సెట్టింగ్స్ ఆధారంగా ఆటోమేటిక్‌గా నిర్ణయమవుతుంది.ఉదాహరణకు, రోజువారీ చిన్న ఖర్చులు డెబిట్‌గా, పెద్ద కొనుగోళ్లు క్రెడిట్‌లో జరిగేలా ఈ కార్డును సెట్ చేసుకోవచ్చు.

### భారత్ ఎందుకు కీలక మార్కెట్?

భారత్‌లో క్రెడిట్ కార్డు వినియోగం అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే తక్కువ. అదే సమయంలో నగదు లావాదేవీల వాటా చాలా పెద్దది. ఈ పరిస్థితిలో ఒకే కార్డు ద్వారా డెబిట్--క్రెడిట్ సౌకర్యం ఇవ్వడం వల్ల డిజిటల్ చెల్లింపులు మరింత విస్తరించవచ్చని వీసా భావిస్తోంది.

# కొన్ని క్యాన్సర్లను నివారించొచ్చు

**38% కేసులకు ముందస్తుగా అడ్డుకట్ట**
**ఏటా 71 లక్షల మందిని కాపాడవచ్చు**
**ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడి**




స్పెషల్ డెస్క్: క్యాన్సర్.. ప్రపంచాన్ని వణికిస్తున్న అత్యంత భయంకరమైన వ్యాధి. ఏటా ఒక కోటి మంది ఈ వ్యాధి బారినపడి కన్నుమూస్తున్నారంటే ముప్పు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి కొత్త క్యాన్సర్ కేసుల్లో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ నివారించదగినవే. అంటే ఏటా 71 లక్షల మందిని ఈ మహమ్మారి బారిన పడకుండా కాపాడవచ్చన్నమాట. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) శాస్త్రవేత్తల నివేదిక ప్రకారం.. 2022లో 1.87 కోట్ల మందికి కొత్తగా క్యాన్సర్ సోకింది. ఇందులో సుమారు 38% కేసులు ఇన్ఫెక్షన్లు (అంటువ్యాధులు), జీవనశైలి అలవాట్లు, పర్యావరణ కాలుష్య కారకాల వల్ల సంభవించాయని అంచనా. ఇవన్నీ నివారించదగినవే. హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ఇన్ఫెక్షన్ల వల్ల కలిగే గర్భాశయ క్యాన్సర్లను సకాలంలో టీకాలు వేయడం ద్వారా అడ్డుకోవచ్చు. అలాగే స్మోకింగ్ వల్ల కలిగే అనేక కణితులను ధూమపానం మాన్పించడం ద్వారా చెక్ పెట్టవచ్చు. ఇలా లక్షలాది మంది ప్రజల జీవితాలను మార్చడానికి 'శక్తివంతమైన అవకాశం'ఉందని పరిశోధకులు అంటున్నారు.

### కొన్ని క్యాన్సర్లు అనివార్యం..

వయసు పెరిగే కొద్దీ మన డీఎన్‌ఏలో అనివార్యంగా జరిగే నష్టం లేదా వ్యాధి వచ్చే ప్రమాదాన్ని పెంచే జన్యువులు వారసత్వంగా రావడం వల్ల కొన్ని క్యాన్సర్లు అనివార్యం. అయితే 10లో దాదాపు నాలుగు కేసులను నివారించవచ్చన్న అంశం జనంలో ఆసక్తి రేకెత్తిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే 30 నివారించగల కారకాలను డబ్ల్యూహెచ్‌ఓలో భాగమైన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ అనే సంస్థ విశ్లేషించింది. ధూమపానం, అతినీలలోహిత (అల్ట్రావయోలెట్) కిరణాలు వీటిలో ఉన్నాయి. ఇవి మన డీఎన్‌ఏను నేరుగా దెబ్బతీస్తాయి. ఊబకాయం, శరీరంలో వాపు, హార్మోన్లను మార్చే అతి తక్కువ శారీరక శ్రమ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతోంది. వాయు కాలుష్యం వల్ల నిద్రాణమైన క్యాన్సర్ కణాలు మేల్కొంటాయని ఏజెన్సీ వెల్లడించింది.

### ధూమపానం ప్రధాన కారణం

క్యాన్సర్‌కు దారితీసే తొమ్మిది ఇన్ఫెక్షన్లను కూడా ఏజెన్సీ నివేదించింది. వీటిలో హెచ్‌పీవీ, కాలేయ క్యాన్సర్‌కు దారితీసే హెపటైటిస్ వైరస్‌లు, కడుపు నొప్పి, అల్సర్స్, తీవ్రమైన గ్యాస్ సమస్యలకు కారణం అయ్యే హెలికోబాక్టర్ పైలోరి బ్యాక్టీరియా ఉన్నాయి. పరిశోధన బృందం 2022 నుండి 36 రకాల క్యాన్సర్ కేసుల డేటాను.. అలాగే 185 దేశాలలో 2012--22 మధ్య ఈ వ్యాధికి మూలమైన 30 ప్రమాద కారకాల సమాచారాన్ని విశ్లేషించి నివేదికను రూపొందించింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక క్యాన్సర్ కేసులకు ధూమపానం ప్రధాన కారణమని వెల్లడించింది. ఆ తరువాతి స్థానాల్లో ఇన్ఫెక్షన్లు, మద్యపానం ఉన్నాయి. భవిష్యత్తులో క్యాన్సర్ భారాన్ని తగ్గించుకోవడానికి ప్రమాద కారకాలను నివారించడం అత్యంత శక్తివంతమైన మార్గాలలో ఒకటి అని పరిశోధన వెల్లడించింది.

### దేశాలకు అనుగుణంగా..

పురుషుల క్యాన్సర్లలో 45% నివారించదగినవిగా ఉండగా.. మహిళల్లో ఇది 30% ఉంది. నివారణ స్థాయి పురుషులలో అధిక స్థాయిలో ఉండడానికి కారణం.. ధూమపాన ప్రియులు పురుషుల్లో ఎక్కువగా ఉండడమే. యూరప్‌లో నివసించే మహిళల్లో క్యాన్సర్ దరి చేరకుండా ఫుల్‌స్టాప్ పెట్టే మొదటి మూడు కారణాల్లో ధూమపానం, ఇన్ఫెక్షన్లు, ఊబకాయం ఉన్నాయి. సబ్--సహారా ఆఫ్రికాలో మహిళల్లో నివారించగల క్యాన్సర్లలో ఇన్ఫెక్షన్ల వాటా దాదాపు 80% ఉంది. అంటే ఈ క్యాన్సర్లను పరిష్కరించడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు తీసుకునే చర్యలు ప్రతి ప్రాంతం లేదా దేశానికి అనుగుణంగా ఉండాలని నివేదిక వివరించింది.

### సగం వాటా వాటిదే..

నేచర్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ నివేదిక ప్రకారం ధూమపానం, వాయు కాలుష్యంతో ఊపిరితిత్తుల క్యాన్సర్, హెలికోబాక్టర్ పైలోరి ఇన్ఫెక్షన్‌తో ముడిపడి కడుపు క్యాన్సర్, హ్యూమన్ పాపిలోమా వైరస్‌తో గర్భాశయ క్యాన్సర్.. నివారించగల మొత్తం క్యాన్సర్ కేసుల్లో ఇవి దాదాపు సగం ఉంటాయి. ధూమపానం నియంత్రణ, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేపట్టిన దేశాల్లో క్యాన్సర్ కేసులు తగ్గాయని నివేదిక తెలిపింది. ధూమపానం ప్రపంచవ్యాప్తంగా పురుషుల్లో అతిపెద్ద ముప్పుగా పరిణమించింది.

### మహిళల్లో 30% నివారించవచ్చు..

నివేదిక ప్రకారం.. మహిళల్లో 92 లక్షల కొత్త క్యాన్సర్ కేసుల్లో సుమారు 30% నివారించవచ్చు.

సబ్ సహారా ఆఫ్రికా వంటి తక్కువ, మధ్యస్థాయి ఆదాయ దేశాల్లో సరై?వకల్ క్యాన్సర్ కేసులు అధికం.

అధిక ఆదాయ దేశాలైన ఉత్తర అమెరికా, యూరప్‌లో మహిళల్లో క్యాన్సర్‌కు స్మోకింగ్ ప్రధాన కారణం.

పురుషుల్లో 43 లక్షల నివారించదగ్గ క్యాన్సర్ కేసుల్లో 25% ధూమపానం కారకంగా నిలిచింది.

ఇన్ఫెక్షన్‌తో కూడిన క్యాన్సర్ కేసులు పురుషుల్లో ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికాలో ఎక్కువ.

# స్పామ్ కాల్స్.. ఇక బ్లాక్!

**ఫిర్యాదుల అవసరం లేకుండానే నిషేధం**
**స్పామ్ నంబర్‌గా టెల్కోలు గుర్తిస్తే చర్యలు**
**కసరత్తు చేస్తున్న టెలికం నియంత్రణ సంస్థ**




అవాంఛిత, మోసపూరిత కాల్స్, సందేశాలు ప్రపంచానికి సవాల్‌గా మారాయి. వ్యక్తుల భద్రతకు ముప్పుగా పరిణమించడంతోపాటు ఆర్థిక నష్టాలకూ ఇవి కారణం అవుతున్నాయి. మన దేశంలో 95% మంది మొబైల్ యూజర్లకు ప్రతిరోజూ స్పామ్ కాల్స్, సందేశాలు వెల్లువెత్తుతున్నాయంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో స్పామ్ కాల్స్‌కు చెక్ పెట్టేందుకు టెలికం నియంత్రణ సంస్థ (ట్రాయ్) సిద్ధమవుతోంది. కస్టమర్ అందుకున్న కాల్, మెసేజ్‌ను టెలికం కంపెనీ స్పామ్‌గా గుర్తిస్తే ఆ నంబర్‌ను బ్లాక్ లిస్టులోకి చేర్చాలని భావిస్తోంది. అలాగే అధికారిక ఫిర్యాదు లేకపోయినా స్పామ్ మెసేజ్‌లు పంపే మొబైల్ నంబర్‌ను డిస్‌కనెక్ట్ చేయాలన్న ప్రతిపాదనపై ట్రాయ్ కసరత్తు చేస్తోంది. టెలికం కంపెనీలతో ఈ మేరకు చర్చిస్తోంది. ప్రస్తుతం టెల్కోలు 10 రోజుల వ్యవధిలో ఐదు ప్రత్యేక ఫిర్యాదులను స్వీకరిస్తే స్పామర్‌పై చర్య తీసుకుంటున్నాయి. తాజా ప్రతిపాదన ప్రకారం ఒక నంబర్‌ను వరుసగా 10 రోజులపాటు అనుమానిత స్పామ్‌గా ఏఐ టెక్నాలజీ గుర్తిస్తే.. ఆ నంబర్‌కు వ్యతిరేకంగా ఎటువంటి ఫిర్యాదు లేకపోయినా కూడా చర్య తీసుకోవచ్చు. ఇది అమల్లోకి వస్తే స్పామ్ కాల్స్, మెసేజెస్ కట్టడికి టెలికం కంపెనీలు చేపడుతున్న చర్యలకు మరింత ఊతం ఇచ్?చనట్టు అవుతుంది.

### రియల్ టైమ్‌లో విశ్లేషించి..

ప్రస్తుతం దేశంలో ఏదైనా అవాంఛిత సమాచారాన్ని స్పామ్‌గా గుర్తించడానికి నిర్దిష్ట నియమాలు లేవు. కాల్స్, సందేశాలు పంపినవారి రోజువారీ వినియోగ తీరు, కాల్స్ ఎంత సమయం మాట్లాడుతున్నారు, ఎన్ని సందేశాలు పంపిస్తున్నారు, ఎవరెవరికి, ఏ ప్రాంతంలో ఉన్నవారికి ఈ కాల్స్ చేస్తున్నారు వంటి అంశాలను టెల్కోలు ఉపయోగిస్తున్న ఏఐ సాంకేతికత రియల్ టైమ్‌లో విశ్లేషించి.. అవాంఛిత కాల్స్, మెసేజెస్‌ను గుర్తించి వినియోగదారులను అప్రమత్తం చేస్తున్నాయి. కాల్‌ను అంగీకరించడం లేదా తిరస్కరించడం అనేది కస్టమర్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. అయితే అనుమానిత స్పామ్‌గా గుర్తించిన అనేక కాల్స్ నిజమైన కాలర్ల నుంచి వచ్?చనవే ఉంటున్నాయి. వాటిలో గిగ్ వర్కర్లతోపాటు ఇతర వాణిజ్య సంస్థలు ఉన్నాయి.

### వ్యవస్థీకృతంగా మోసాలు..

2024 సెపట?టంబర్ నుంచి 2026 జనవరి మధ్య 7,100 కోట్ల స్పామ్ కాల్స్, 290 కోట్ల స్పామ్ సందేశాలను గుర్తించినట్లు ఎయిర్‌టెల్ ప్రకటించింది. 8 లక్షలకుపైగా మోసపూరిత లింక్స్‌ను బ్లాక్ చేసినట్లు వెల్లడించింది. సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ కాల్ సెంటర్లతో వ్యవస్థీకృతంగా మోసపూరిత కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్ల కారణంగా ప్రపంచవ్యాప్తంగా రూ. 92.7 లక్షల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని భారతీ ఎయిర్‌టెల్ చీఫ్ రెగ్యులేటరీ ఆఫీసర్ రాహుల్ వాట్స్ వెల్లడించారు. 250కిపైగా కొలమానాలను పరిగణనలోకి తీసుకొని స్పామ్ కాల్స్, సందేశాలను గుర్తిస్తున్నట్టు చెప్పారు.

టెల్కోలు ఏఐ సొల్యూషన్స్ సాయంతో ప్రతి నెలా సుమారు 40 కోట్ల కాల్స్, సందేశాల ను అనుమానిత స్పామ్‌గా గుర్తిస్తున్నాయి.

నమోదు కాని టెలీమార్కెటర్ల నుంచి వస్తున్న వాటిలో 7.5 కోట్ల కాల్స్, ఎస్‌ఎంఎస్‌లు ప్రతిరోజూ బ్లాక్ అవుతున్నాయి.

స్పామర్లపై టెల్కోలకు రోజుకు సగటున 10,000 ఫిర్యాదులు మాత్రమే అందుతున్నాయని సమాచారం.

2025 ఫిబ్రవరిలో 1,16,213 స్పామ్ ఫిర్యాదులు టెల్కోలకు అందగా 2025 డి సెంబర్‌లో ఆ సంఖ్య 3,34,317కు చేరింది.


ఫిర్యాదులలో ఎక్కువ భాగం నమోదు కాని టెలిమార్కెటర్లపైనే ఉంటున్నాయి.

టెలిమార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు సాధారణంగా 10 అంకెల మొబైల్ నంబర్ ద్వారా కాల్స్ చేస్తున్నారు.


భారత్‌లో 116 కోట్ల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. వారిలో అవాంఛిత కాల్స్‌ను నివారించేందుకు ట్రాయ్ తీసుకొచ్?చనడు నాట్ డిస్టర్బ్ (డీఎన్‌డీ) సేవలను 22 కోట్ల మంది మాత్రమే ఎంపిక చేసుకున్నారు.



# బెర్రీ కోకలో పిసీ వీపందం చూడు



ఇక్కడ గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా ఫోజ్ చూశాక ఫ్యాన్స్ ఇలా కామెంట్ చేస్తున్నారు. ప్రియాంక చోప్రా బెర్రీ రెడ్ చీరలో షో స్టాపర్ గా నిలిచింది. అయితే ఈ గెటప్ తో ఎక్కడ మెరిసింది? అని ప్రశ్నిస్తే.. తన సోదరుడు సిద్ధార్థ్ పెళ్లికి అటెండయిన పీసీ ఇలా వేడుక ఆద్యంతం సెంటరాఫ్ ఎట్రాక్షన్ గా నిలిచారు. ఈ వేడుకకు భారీగా సినీసెలబ్రిటీలు అటెండయ్యారు. దేశీ గర్ల్ ప్రియాంక చోప్రా జోనాస్ కి ఈ కస్టమ్ మేడ్ డిజైనర్ డ్రెస్ ని ఎవరు రూపొందించారు? అంటే ది గ్రేట్ మనీష్ మల్హోత్రా అని కూడా చెబుతున్నారు. ఆమె స్టైలిస్ట్ అమీ పటేల్ ఇన్‌స్టాలో - పీసీలీషియస్ బెర్రీలిషియస్ - అని రాసింది. నీష్ డిజైనర్ లుక్ సౌందర్యాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు. బోల్డ్ అండ్ బెర్రీలీషియస్ కస్టమ్ మేడ్ చీర అదే రంగులో 3%ణ% ఎంబ్రాయిడరీ బ్లౌజ్‌తో పీసీ ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది. ఈ చీర కూడా 3%ణ% ఎంబ్రాయిడరీ టోన్‌ను కలిగి ఉంది. ప్రియాంక తన సోదరుడు సిద్ధార్థ్ చోప్రా వివాహ వేడుకల కోసం ఈ చీరను ప్రత్యేకంగా డిజైన్ చేయించారని సమాచారం. ఆ ఒక్క లుక్కుతో పెళ్లిలో అహూతులను పీసీ కిల్ చేసింది. బెర్రీ చీరలో రియల్ స్టన్నర్ గా మెరిసిపోయింది. ప్రియాంక ధరించిన ఆభరణాలు అంతే ఖరీదైనవి. ఆకర్షణీయమైనవి.. చోకర్ -ముత్యాలు, కెంపులు -వజ్రాలతో అలంకరించిన లేయర్డ్ నెక్లెస్, డైమండ్ బ్రాస్‌లెట్‌తో కూడిన బల్గారి ఆభరణాలతో తన రూపాన్ని మరింత మెరుగుపరిచింది. రీగల్ సెట్ లో ప్రియాంక దేశీ గ్లామ్ లుక్ హీట్ పెంచింది. 2024లో మరో అద్భుతమైన మూవ్ మెంట్ ఇది అంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. సెలబ్రిటీ స్టైలిస్ట్ అమీ పటేల్‌కు ప్రియాంక వైబ్‌ని ఎలా సెలబ్రేట్ చేయాలో సూపర్బ్ గా తెలుసు! అని కూడా కితాబిచ్చేస్తున్నారు. సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ ఫ్లోరియన్ హురెల్ రూపొందించిన రెట్రో హై మెస్సీ బన్ హెయిర్ స్టైల్ ప్రియాంక లుక్ కి మరో అదనపు ఆకర్షణ. సిగ్నేచర్ బోల్డ్ లిప్ కలర్‌తో స్టైలిష్ లుక్‌ని వందశాతం ఫుల్ ఫిల్ చేసింది పీసీ. ఇన్‌స్టాలో షేర్ చేసిన ఫోటోలలో తన ప్రియమైన స్నేహితురాలు తమన్నా దత్ కూడా పాస్టెల్ చీరను ధరించి కనిపించింది. %-%బెర్రీస్ అండ్ క్రీమ్%-% అనే క్యాప్షన్ ని ఈ చీరకు ఇచ్చింది. చాలా సంవత్సరాలుగా ప్రియాంక మనీష్ డిజైన్‌లను ఉపయోగిస్తోంది. అతడు రూపొందించే అద్భుతమైన డిజైనర్ దుస్తుల్లో చీరకు స్థిరమైన స్థానం ఉంది. దోస్తానా చిత్రంలోని -దేశీ గర్ల్ - పాటలో పీసీ ధరించిన ఖరీదైన చీరను మనీష్ రూ పొందించాడు. నీలం ఉపాధ్యాయతో నిశ్చితార్థం చేసుకున్న ప్రియాంక సోదరుడు ఏప్రిల్ 2024లో రోకా వేడుకను జరుపుకున్నారు. ఈ వేడుకకు ప్రియాంక, నిక్ జోనాస్ , వారి కుమార్తె మాల్తీ మేరీ చోప్రా జోనాస్ హాజరయ్యారు.



# చూపు తిప్పనివ్వని 'రంగబలి' హీరోయిన్





మోడలింగ్ చేస్తూ 2019 లో ఎంటీవీ సూపర్ మోడల్ ఆఫ్ ది ఇయర్ లో నాల్గవ స్థానంలో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించిన ముద్దుగుమ్మ యుక్తి తరేజా. మోడల్ గా చాలా కాలంగా పలు కమర్షియల్స్ లో నటిస్తూ ఉన్న ఈ అమ్మడికి తెలుగు లో నాగ శౌర్య హీరోగా నటించిన రంగబలి సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమా కమర్షియల్ గా నిరాశ పరచడంతో యుక్తి తరేజా కి పెద్దగా ఆఫర్లు రావడం లేదు. ఆమె సోషల్ మీడియా ద్వారా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ మళ్లీ ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తోంది. హర్యానా సమీపంలోని కైతల్ ప్రాంతంలో 2000 సంవత్సరంలో పర్వీన్ తరేజా, రీటా తరేజాలకు జన్మించిన యుక్తి తరేజా మోడల్ గా దక్కించుకున్న గుర్తింపు కారణంగా ఇమ్రాన్ హష్మి చేసిన లూట్ గయే మ్యూజిక్ ఆల్బం లో కనిపించింది. ఆ పాటలో స్క్రీన్ స్పేస్ తక్కువ ఉండటం వల్ల ఈమె కెరీర్ కి ఆ పాట కూడా పెద్దగా హెల్ప్ అయ్యింది లేదు. అయితే ఆ పాట వల్ల పలు ఆఫర్లు ఈ అమ్మడికి వచ్చాయి. మోడల్ గా మరింగా బిజీ అయ్యిందని ఆమె సన్నిహితులు అంటూ ఉంటారు. తాజాగా సోషల్ మీడియాలో అందమైన ఫోటోను షేర్ చేసింది. వైట్ టాప్ తో బ్లూ డెనిమ్ జీన్స్ షార్ట్ తో కన్నుల విందు చేసే విధంగా యుక్తి తరేజా కవ్విస్తూ ఉంది. ఈ స్థాయి అందం కు టాలీవుడ్ లో తగిన గుర్తింపు రావడం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తే మరి కొందరు మాత్రం చూపు తిప్పుకోనివ్వని ఈ అమ్మడి అందంకు ఇప్పుడు కాకున్నా ముందు ముందు అయినా తప్పకుండా మంచి ఆఫర్లు వస్తాయనే అభిప్రాయంను వ్యక్తం చేస్తూ ఫోటోలను లైక్ చేస్తూ తెగ కామెంట్స్ చేస్తూ షేర్ చేస్తున్నారు. గత సంవత్సరం ప్రేక్షకుల ముందుకు వచ్చిన రంగబలి సినిమాకు పవన్ బసంశెట్టి దర్శకత్వం వహించాడు. సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై నిర్మించాడు. విభిన్నమైన టైటిల్ తో వచ్చిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి తిరస్కరణ ఎదురైంది. ఈ సినిమా లో నాగ శౌర్య, యుక్తి తరేజాలతో పాటు సత్య, షైన్ టామ్ చాకో, శరత్ కుమార్ మురళి శర్మ ఇంకా ప్రముఖ నటీనటులు నటించారు. కథ విషయంలో నిరాశ పరచినా కూడా కొన్ని పాత్రలు బాగున్నాయనే రివ్యూలు వచ్చాయి.

# లంగావోణిలో జగతి.. నడుముతోనే స్టన్ అయ్యేలా..





తెలుగు టెలివిజన్ రంగం లో ప్రత్యేక గుర్తింపు పొందిన నటీమ ణులలో జ్యోతి రాయ్ ఒకరు. 'జగతి' పాత్రతో ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, తన నటనతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చోటు సంపాదించుకుంది. ఇటీవల, జ్యోతి తన గ్లామర్ ఫోటోల ద్వారా సోషల్ మీడియాలో మరింత క్రేజ్ తెచ్చుకుంది. జ్యోతి తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించి, దర్శకుడు సుకు పూర్వాజ్‌తో వివాహం చేసుకుంది. తన పేరును జ్యోతి పూర్వాజ్‌గా మార్చుకున్న ఆమె, కొత్త పేరుతోనే కాదు, కొత్త లుక్‌తో కూడా ఆకట్టుకుంటోంది. కొన్ని రోజుల క్రితం మినీ డ్రెస్సులో ఆమె షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, ఆమె అందానికి ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. ఇక లేటెస్ట్ గా అమ్మడు నల్లని రంగు లంగా వోణిలో అందంగా దర్శనమిచ్చింది. గతంలో ఎన్నోసార్లు గ్లామర్ డ్రెస్సులో కనిపించిన జ్యోతి ఈ లుక్ లో ఇంకా అందంగా ఉందంటూ ఫాలోవర్స్ పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. ఇంటర్నెట్‌లో జ్యోతి ఫోటోలను చూసిన అభిమానులు ఆమె స్టైల్, గ్లామర్ గురించి ప్రశంసలు కురిపిస్తున్నారు. మరింత అందంగా కనిపిస్తున్న ఆమె టాటూలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఫ్యాన్స్ ఆమె లుక్‌పై పాజిటివ్ రియాక్షన్లు ఇస్తున్నారు. అభిమానులను ఆకట్టుకుంటూ జ్యోతి తన కెరీర్‌లో కూడా బిజీగా ఉంది. టెలివిజన్‌లో 'గుప్పెడంత మనసు' సీరియల్ ద్వారా పాపులారిటీ పొందిన ఆమె, వెబ్ సిరీస్‌లు, సినిమాల్లోనూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. ప్రస్తుతం జ్యోతి తన భర్త సుకు పూర్వాజ్‌తో కలిసి ప్రముఖ చిత్ర దర్శకుడు రూపొందిస్తున్న 'ఏ మాస్టర్ పీస్' చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది.పాటు, తన ఈ చిత్రం విజయవంతమైతే, జ్యోతి కెరీర్‌లో కీలక మలుపు తిరగవచ్చు. గ్లామర్‌తో నటనతో కూడా ప్రేక్షకులను మెప్పించడానికి జ్యోతి కృషి చేస్తోంది. తెలుగులో హీరోయిన్‌గా స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ నటీమణి, భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు.



# సామ్ ఏంటి ఇలా మారిపోయింది? ఏం జరుగుతోంది?

స్టార్ హీరోయిన్ సమంత.. ఈ మధ్య వార్తల్లో బాగా నిలుస్తోంది. మయోసైటిస్ బారిన పడ్డ తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చిన ఆమెను మళ్లీ సిల్వర్ స్క్రీన్ పై చూసేందుకు అభిమానులు ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. అయితే అమ్మడు ఎప్పుడో పూర్తి చేసిన సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ మరికొద్ది రోజుల్లో స్ట్రీమింగ్ కానుంది. తన బ్యానర్ పై ఓ సినిమాను అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. మరిన్ని ప్రాజెక్టుల విషయంలో చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది సమంత. తన ఫ్యాన్స్ కోసం ఎప్పటికప్పుడు కొత్త పిక్స్ షేర్ చేసుకుంటోంది. హెల్త్ కు సంబంధించిన పలు విషయాలు పోస్ట్ చేస్తుంటుంది. అదే సమయంలో ఈ మధ్య ఓ స్పెషల్ అప్డేట్ అని చెప్పి.. పికిల్ బాల్ లీగ్ లో చెన్నై ఫ్రాంచైజీని కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. అప్పుడు సామ్.. డెనిమ్ జీన్స్, బ్లాక్ కలర్ పోలో టీ షర్ట్ లో కాస్త ఫిట్ గా కనిపించింది. కానీ ఆమె బాగా సన్నబడిందని నెటిజన్లు కామెంట్స్ పెట్టారు. ఇటీవల ముంబైలో జరిగిన అనామికా ఖన్నా %శ ఎడవీ% కలెక్షన్ లాంచ్ ఈవెంట్ లో బ్లాక్ కలర్ డ్రెస్ లో సమంత తళుక్కుమంది. ఫాబ్రిక్ పెయింట్ డిజైన్ డ్రెస్ అదిరిపోయినా.. సామ్ పిక్స్ చూసి మాత్రం షాకయ్యామని ఫ్యాన్స్ చెబుతున్నారు. పూర్తిగా ఆమె మారిపోయినట్లు కనిపిస్తోందని అంటున్నారు. అదేంటి ఎందుకు అలా అయిపోయిందని కామెంట్స్ పెడుతున్నారు. ఒక్కసారిగా బాగా వెయిట్ తగ్గడం చూస్తుంటే షాకింగ్ గా ఉందని అంటున్నారు. సామ్ ఫేస్ లో అప్పటి గ్లో కనిపించడం లేదని చెబుతున్నారు. ఒక్కొక్కరు ఒక్కోలా రెస్పాండ్ అవుతున్నారు. పర్సనల్ రీజన్ వల్ల సన్నబడిందా, లేక మయోసైటిస్ చికిత్సలో భాగంగా స్లిమ్ అయిందా అని అనుమానపడుతున్నారు. మరికొందరు సన్నబడినా.. హెల్దీగా ఉంటే చాలని చెబుతున్నారు. ఏదేమైనా సామ్ కొత్త లుక్ చూసి మాత్రం ఒక్కసారిగా అంతా షాకైనట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో సమంత కొత్త పిక్స్ తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఇక సామ్ కెరీర్ విషయానికి వస్తే.. బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ తో కలిసి చేసిన సిటాడెల్ వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలో నవంబర్ 7వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. అందుకు సంబంధించిన ప్రమోషన్స్ త్వరలో స్టార్ట్ కానున్నాయి. తన బర్త్ డే రోజు అనౌన్స్ చేసిన మా ఇంటి బంగారం మూవీలో లీడ్ రోల్ లో నటిస్తూనే ప్రొడ్యూస్ చేయనుంది సమంత. మరి ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు ఆమె ఎప్పుడు వస్తుందో వేచి చూడాలి.



NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .